**విలేకరులు కావలెను**

**పెన్ సత్తా తెలుగు దినపత్రిక**

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 3 సంచిక : 274 ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ మంగళవారం 24 ఫిబ్రవరి 2026 పేజీలు : 08 వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool




## అవినీతిని ప్రశ్నిస్తున్నందుకే టార్గెట్ చేస్తున్నారు

ప్రభుత్వాల అవినీతిని, అక్రమాలను ప్రశ్నిస్తూ.. వాటికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నందుకే అందరూ తనను లక్ష్యంగా చేసుకుంటున్నారని టీవీకే చీఫ్ విజయ్ ఆరోపించారు. తమ పార్టీ నిర్వహించే బహిరంగ సభలకు కూడా డీఎంకే ప్రభుత్వం అనుమతి ఇవ్వట్లేదన్నారు. అందువల్లే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రజలను కలవలేకపోతున్నానని వెల్లడించారు. టీవీకే ఎన్నికల్లో విజయం

- మిగతా 2లో

## బెంగాల్‌ను చూస్తుంటే గుండె తరుక్కుపోతోంది

### ఆ రాష్ట్ర ప్రజలకు మోదీ బహిరంగ లేఖ

కోల్‌కతా: ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పాలనలోని పశ్చిమబెంగాల్‌ను చూస్తుంటే గుండె తరుక్కుపోతోందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. రాష్ట్రంలో రాజకీయ మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు.


- మిగతా 2లో



# పనితీరు ఆధారంగా ఉద్యోగులకు వెయిటేజ్...

### సీఎం చంద్రబాబు కొత్త విధానం

- ఉత్తమ పనితీరు కనబరిచే వారికి అభినందన లేఖలు పంపాలని సీఎం ఆదేశం
- రెవెన్యూ శాఖకు ఉన్న చెడ్డపేరు పోవాలి, ఫ్రెష్ లుక్ తీసుకురావాలని దిశానిర్దేశం
- ఆసుపత్రుల్లో డాక్టర్ల కొరత లేకుండా చూడాలని, పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాలని సూచన
- టెక్నాలజీ ఆధారిత సేవలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ



ప్రభుత్వ యంత్రాంగంలో జవాబుదారీతనం పెంచడంతో పాటు, ఉద్యోగుల్లో నూతనోత్సాహం నింపే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇకపై ఉద్యోగుల పనితీరు ఆధారంగా వారికి వెయిటేజ్ ఇవ్వాలని, ఉత్తమ పనితీరు కనబరిచే వారిని గుర్తించి ప్రభుత్వం తరఫున అభినందన లేఖలు పంపాలని ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సులభతరం చేయడమే లక్ష్యంగా సోమవారం ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల పనితీరును ప్రోత్సహించే ఈ నూతన విధానాన్ని ప్రకటించారు.

క్షేత్రస్థాయిలో ప్రజల మన్ననలు పొందుతూ, అంకితభావంతో పనిచేస్తున్న సిబ్బందిని గుర్తించడం వల్ల వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. పనితీరు సరిగా లేని వారిని గుర్తించి ప్రేరణ కల్పించడంతో పాటు, బాగా పనిచేస్తున్న వారిని ప్రశంసించడం ద్వారా ఉద్యోగుల్లో ఆరోగ్యకరమైన పోటీతత్వం పెరుగుతుందని ఉన్నతాధికారులు సైతం ఏకీభవించారు. "ప్రతి నెలా ఉత్తమ పనితీరు కనబరిచే ఉద్యోగులను గుర్తించి, వారికి అభినందన లేఖలు పంపాలి. ఈ ప్రశంసలను వారి సర్వీస్ రికార్డులలో కూడా నమోదు చేయాలి. ఇది వారి కెరీర్‌కు దోహదపడుతుంది," అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ విధానం ప్రభుత్వ ఉద్యోగులను అభినందించడంలో ఒక కొత్త అధ్యాయమని, దీని ద్వారా పాలనలో మరింత సానుకూల మార్పు వస్తుందని అధికారులు పేర్కొన్నారు.

**ఆసుపత్రులు, దేవాలయాలపై ప్రత్యేక దృష్టి**

వైద్యారోగ్యం, దేవదాయ శాఖల పనితీరుపై సమీక్షిస్తూ సీఎం పలు కీలక సూచనలు చేశారు. "ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి బోధనాసుపత్రుల వరకు అన్ని స్థాయిల్లో పారిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. నిర్లక్ష్యంగా వ్యవహరించే ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలను బాధ్యులను చేయండి. పారిశుద్ధ్యం, వైద్య పరికరాల నిర్వహణపై ఆసుపత్రుల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లకు పూర్తి బాధ్యత అప్పగించాలి.

- మిగతా 2లో



## వైకాపా పాలనలో జగన్ కంపెనీలకు.. రూ.వెయ్యి కోట్లకు పైగా అనుచిత లబ్ధి

- ఇన్నేళ్ల తెదేపా పాలనలో హెరిటేజ్‌కు ఒక్క రూపాయీ తీసుకోలేదు
- హెరిటేజ్‌పై బొత్స వ్యాఖ్యలు అర్థరహితం
- మంత్రి లోకేశ్ ధ్వజం

వైకాపా అధికారంలో ఉన్న ఐదేళ్లలో సాక్షి పత్రిక, టీవీ ఛానల్, భారతి సిమెంట్స్ సహా జగన్ కంపెనీలు ప్రభుత్వం నుంచి రూ.వెయ్యి కోట్లకు పైగా అనుచిత లబ్ధి పొందాయని విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. తెదేపా అధికారంలో ఉన్న ఇన్నేళ్లలో ప్రభుత్వం నుంచి హెరిటేజ్ ఒక్క రూపాయి కూడా లబ్ధి పొందలేదని తెలిపారు. ఏపీ సహా ఏ రాష్ట్ర ప్రభుత్వంతోనూ వ్యాపారం చేయరాదన్నది హెరిటేజ్ విధానమని స్పష్టంచేశారు. లోకేశ్ సోమవారం శాసనసభ లాబీల్లో మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. 'ఇందాపూర్ డెయిరీ..

- మిగతా 2లో

## ఏ దేశమైనా ఆటలాడాలని చూస్తే భారీ టారిఫ్ విధిస్తాం

- సుప్రీంకోర్టు తీర్పును అలుసుగా తీసుకుంటే ఊరుకునేది లేదని హెచ్చరిక
- సుప్రీంకోర్టు తనకు తెలియకుండానే మరిన్ని అధికారాలు కట్టబెట్టిందని వ్యాఖ్య
- దశాబ్దాలుగా కొన్ని దేశాలు అమెరికాను కొల్లగొట్టాయని ఆరోపణ



వివిధ దేశాలపై డొనాల్డ్ ట్రంప్ విధించిన అదనపు సుంకాలను అమెరికా సుప్రీంకోర్టు తప్పుబట్టిన విషయం తెలిసిందే. అమెరికా కాంగ్రెస్ అనుమతి లేకుండా వేసిన ఈ సుంకాలు చెల్లవని తీర్పు వెలువరించింది. ఈ తీర్పుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పందించారు. సుప్రీంకోర్టు తీర్పును అలుసుగా తీసుకుని ఏ దేశమైనా ఆటలాడా లని చూస్తే భారీ టారిఫ్‌లు విధిస్తానని హెచ్చరించారు.సుప్రీంకోర్టు ఈ తీర్పు ద్వారా తెలియకుండానే తనకు మరిన్ని అధికారాలు కట్టబెట్టిందని వ్యాఖ్యానించారు. కొన్ని దేశాలు అమెరికాను దశాబ్దాలుగా కొల్లగొట్టాయని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పును ఆధారంగా చేసుకుని, ఇష్టానుసారం వ్యవహరించాలని చూస్తే ఇటీవల అంగీకరించిన సుంకాల కంటే భారీగా ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన తన ట్రూత్ సోషల్ మీడియాలో ఈ హెచ్చరిక జారీ చేశారు.అంతర్జాతీయ అత్యయిక ఆర్థిక అధికారాల చట్టంను ఉపయోగించి డొనాల్డ్ ట్రంప్ తన మాట వినని వివిధ దేశాలపై అధిక పన్ను విధించారు. ట్రంప్ అధిక సుంకాలకు అమెరికా కాంగ్రెస్ ఆమోదం లేదు. టారిఫ్ అంశం సుప్రీంకోర్టుకు వెళ్లగా, ట్రంప్ తీరును తప్పుబట్టింది. ఆయన నిర్ణయానికి వ్యతిరేకంగా తీర్పు వెలువరించింది.


- మిగతా 2లో

## మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం

### శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన

అమరావతి: రాజమహేంద్రవరంలో కల్తీ పాల ఘటనలో మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం అందించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. చికిత్స పొందుతున్నవారి ఆరోగ్యం మెరుగుపడే వరకు ఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కల్తీపాల ఘటనపై

- మిగతా 2లో





## ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రహార్

### కీలక విధానాన్ని ప్రకటించిన కేంద్రం

దిల్లీ: కేంద్ర ప్రభుత్వం సోమవారం "ప్రహార్" పేరుతో దేశంలో తొలి ఉగ్రవాద నిర్మూలన విధానానికి తెరతీసింది. బహుముఖ వ్యూహాన్ని అవలంబిస్తూ ఉగ్రవాదం పట్ల ఏమాత్రం సహనం


- మిగతా 2లో

### కొయ్యలగూడెం మండలంలో రవాణా సమస్యకు పవన్ పరిష్కారం

- ఎర్రంపేట--రాజవరం మధ్య 3 కి.మీ. డొంక రోడ్డు నిర్మాణం పూర్తి
- ఉపాధి హామీ పథకం నిధులతో మూడు నెలల్లో పూర్తి
- రైతులకు, 12,500 మంది ప్రజలకు రవాణా సౌకర్యం

- మిగతా 2లో





## ఏడుగురు పాక్ ఉగ్రవాదుల కోసం... 326 రోజుల వేట!

- కిష్టవాడ్ లో 326 రోజులు సాగిన 'ఆపరేషన్ త్రాషి-1' సక్సెస్
- భద్రతా దళాల అలుపెరుగని పోరాటంలో ఏడుగురు ఉగ్రవాదులు హతం
- మృతుల్లో జైషే మహమ్మద్ కమాండర్ సైఫుల్లా
- అత్యాధునిక డ్రోన్లు, టెక్నాలజీ సాయంతో ఉగ్రవాదుల వేట
- జమ్మూ ప్రాంతంలో ఉగ్రవాదాన్ని పునరుద్ధరించే కుట్ర భగ్నం

భారత భద్రతా దళాలు జమ్మూ కశ్మీర్‌లోని కిష్టవాడ్ జిల్లాలో సాధించిన ఓ అద్భుతమైన విజయం ఇది. దాదాపు 326 రోజుల పాటు అలుపెరగకుండా సాగించిన 'ఆపరేషన్ త్రాషి-1' విజయవంతంగా ముగిసింది. ఈ సుదీర్ఘ ఆపరేషన్‌లో పాకిస్థాన్ ప్రేరేపిత జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థకు

- మిగతా 2లో

# వైకాపా పాలనలో జగన్ కంపెనీలకు.. రూ.వెయ్యి కోట్లకు పైగా అనుచిత లబ్ధి

-మొదటిపేజీ తరువాయి

హెరిటేజ్‌కు కోకంపెనీ అని బొత్స సత్యనారాయణ ఆరోపించడం విడ్డూరంగా ఉంది. కోకంపెనీ అన్నదే ఉండదన్న విషయం అంత సీనియర్ నేతకు తెలియదా? ఇందాపూర్ డెయిరీ హెరిటేజ్ కంటే చాలా పెద్దది. ఆ సంస్థ ఉత్పత్తుల్లో 30% మాత్రమే రీటెయిల్‌గా విక్రయిస్తుంది. మిగతా 70% ఉత్పత్తులను పెద్ద కంపెనీల కోసం తయారుచేస్తుంది. హెరిటేజ్‌తో పాటు అమూల్, బ్రిటానియా వంటి సంస్థలకు కావలసిన పాల ఉత్పత్తుల్ని తయారుచేసి ఇస్తుంది. దాన్ని కో ప్యాకేజింగ్ అంటారు' అని ఆయన వివరించారు. ఇందాపూర్ డెయిరీ నుంచి హెరిటేజ్ ఎప్పుడూ నెయ్యి కొనుగోలు చేయదని, స్కిమ్డ్ మిల్క్‌పౌడర్, అల్ట్రా హైటెంపరేచర్ మిల్క్ (యూహెచ్‌టీ), పన్నీర్, చీజ్ మాత్రమే ఆ డెయిరీ సరఫరా చేస్తుందని లోకేశ్ తెలిపారు. 'హెరిటేజ్ లిస్టెడ్ కంపెనీ. మా సంస్థపై వైకాపా నాయకులు సెబీకి ఫిర్యాదు చేశారు. ఏమైనా ఆధారాలు చూపించగలిగారా?' అని నిలదీశారు. 'సంబంధం లేని విషయంతో నాలుగు రోజులు శాసనమండలి సమావేశాలు జరగకుండా అడ్డుపడ్డ వైకాపా సభ్యులు.. ఇప్పుడు బడ్జెట్‌పై చర్చించాలని కోరడంలో అర్థం లేదు. సమావేశాల్ని అడ్డుకున్నప్పుడు వారికా విషయం తెలియదా?' అని లోకేశ్ ప్రశ్నించారు. తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంపై మంగళవారం శాసనసభలో చర్చిస్తామని తెలిపారు.

**జగన్ వస్తానంటే నేనే టికెట్ తీస్తా**

టీ-20 క్రికెట్ వరల్డ్‌కప్ పోటీల్లో భారత్ ఫైనల్స్‌కు చేరితే మ్యాచ్ చూసేందుకు కచ్చితంగా వెళ్తానని లోకేశ్ తెలిపారు. పులివెందుల ఎమ్మెల్యే వస్తానంటే ఆయనకూ టికెట్ తానే తీసుకుంటానని పేర్కొన్నారు. 'పార్టీలో సీనియర్లు, జూనియర్లకు సమానంగా ప్రోత్సాహం ఉంటుంది. నాయకులకు వారి సొంత బూత్‌లలో ఎన్ని ఓట్లు వచ్చాయన్నదాన్నిబట్టే పార్టీలో గుర్తింపు ఉంటుంది. నాతో సహా ఎవరికైనా ఇదే వర్తిస్తుంది. సొంత బూత్‌లోనే ప్రభావం చూపలేనివారు.. ఇక నాయకత్వం ఏమిస్తారు?' అని ఆయన వ్యాఖ్యానించారు.

# పనితీరు ఆధారంగా ఉద్యోగులకు వెయిటేజ్...

-మొదటిపేజీ తరువాయి

ఏ ఆస్పత్రిలోనూ వైద్యుల కొరత ఉండకూడదు. అవసరమైన చోట తక్షణం నియామకాలు చేపట్టేలా కలెక్టర్లతో సమన్వయం చేసుకోండి" అని వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే, దేవాలయాల్లో భక్తులకు సౌకర్యాలు మెరుగుపరచాలని, ఆధ్యాత్మిక వాతావరణం ఉండేలా చూడాలని దేవదాయ శాఖ అధికారులకు సూచించారు.

**రెవెన్యూకు ఫ్రెష్ లుక్.. టెక్నాలజీతో అవగాహన**

రెవెన్యూ శాఖ పనితీరుపై సీఎం చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. "రెవెన్యూ శాఖకు ఉన్న చెడ్డపేరు పోవాలి. గతంతో పోల్చుకుంటే స్పష్టమైన మార్పు కనిపించాలి. ఈ శాఖకు ఒక ఫ్రెష్ లుక్ తీసుకురావాల్సిన అవసరం ఉంది. రీ-సర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభించాలి. రెవెన్యూ సేవలను పూర్తిగా ఆటోమేషన్ పరిధిలోకి తెస్తాం. ఎవరైనా అవినీతికి పాల్పడితే ఏసీబీని రంగంలోకి దించాల్సి వస్తుంది. సరిగా పనిచేయని తహసీల్దార్లను పక్కనపెట్టే పరిస్థితి తెచ్చుకోవద్దు" అని హెచ్చరించారు. అదేవిధంగా, తాగునీటి సరఫరాలో నాణ్యతను కాపాడాలని, ఎప్పటికప్పుడు నీటి నమూనాలను పరీక్షించాలని ఆదేశించారు. ల్యాబ్‌లు అందుబాటులో లేని ప్రాంతాల్లో మొబైల్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలపై ఆడిట్ నిర్వహించి, నివారణ చర్యలు చేపట్టాలని రవాణా శాఖకు సూచించారు. ప్రభుత్వం టెక్నాలజీ సాయంతో అందిస్తున్న సేవలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేందుకు మీ-సేవ కేంద్రాలు, డ్వాక్రా సంఘాల ద్వారా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సీఎం ఆదేశించారు. ఈ సమీక్షలో రెవెన్యూ, వైద్యారోగ్యం, దేవదాయ, రవాణా, పట్టణాభివృద్ధి తదితర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం

-మొదటిపేజీ తరువాయి

సీఎం చంద్రబాబు సోమవారం అసెంబ్లీలో ప్రకటన చేశారు. 'రాజమహేంద్రవరంలోని లాలాచెరువు పరిసర ప్రాంతాల్లో పలువురు అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చేరారు. వారి రక్తంలో యూరియా, సీరం క్రియాటినైన్ స్థాయిలు పెరిగినట్లు క్లినికల్ పరీక్షల్లో గుర్తించారు. కోరుకొండ మండలం నరసాపురంలోని వరలక్ష్మి మిల్క్ డెయిరీ ద్వారా 106 కుటుంబాలకు పాలు సరఫరా అయ్యాయి. ఘటనకు అవే కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు. డెయిరీ నిర్వహించే వ్యక్తిని పోలీసులు విచారిస్తున్నారు. రోగుల నమూనాలు, పాల నమూనాలను హైదరాబాద్, విశాఖపట్నంలోని స్టేట్ ఫుడ్ ల్యాబరేటరీలతోపాటు విమ్టా ల్యాబ్‌కు పంపాం' అని ప్రకటించారు.

**చికిత్స పొందుతున్న రితిక్**

వెంటనే రాజమహేంద్రవరం వెళ్లండి: కల్తీ పాలతో జరిగిన మరణాలు, అస్వస్థతపై సీఎం చంద్రబాబు ఉన్నతాధికారులతో సమీక్షించారు. తూర్పుగోదావరి కలెక్టర్, ఎస్పీ, వైద్యారోగ్య, ఫుడ్ సేఫ్టీ అధికారులతో మాట్లాడి పరిస్థితిపై ఆరాతీశారు. బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. పాల నమూనాలను ల్యాబ్‌లకు పంపామని ఫుడ్‌సేఫ్టీ అధికారులు తెలిపారు. ఫుడ్‌సేఫ్టీ, వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు వెంటనే రాజమహేంద్రవరం వెళ్లాలని, పరిస్థితి కుదుటపడేలా చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు.

**72 గంటల్లో ల్యాబ్ ఫలితాలు**

**వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్**

పాల వ్యాపారి నుంచి సేకరించిన నమూనాలు ల్యాబ్‌లకు పంపామని, 72 గంటల్లో ఫలితాలు వస్తాయని మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఉన్నతాధికారులతో ఫోన్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. అంతకుముందు ఆయన శాసనసభలో ఈ అంశంపై ప్రకటన చేశారు. '957 కుటుంబాల స్క్రీనింగ్ చేశాం. చికిత్స అవసరమైనవారిని ఆసుపత్రులకు పంపిస్తున్నాం. వరలక్ష్మి మిల్క్‌డెయిరీలో పాల నమూనాలు సేకరించాం' అని పేర్కొన్నారు.

**పరిస్థితి నియంత్రణలో ఉంది**

**మంత్రి అనిత**

'కల్తీ పాల ఘటన వ్యవహారంపై సీఎం సమీక్షిస్తున్నారు. పరిస్థితి నియంత్రణలోనే ఉంది. పాల విక్రేతను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు' అని అనిత సభకు తెలిపారు.

# బెంగాల్‌ను చూస్తుంటే గుండె తరుక్కుపోతోంది

-మొదటిపేజీ తరువాయి

బెంగాల్‌ను 'బంగారు బంగ్లా'గా మారుస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆ రాష్ట్ర ప్రజలకు మోదీ సోమవారం బహిరంగ లేఖ రాశారు. మరికొద్ది నెలల్లో బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ ఆయన ఈ లేఖ రాయడం గమనార్హం.

**ప్రభుత్వం నుంచి సహకారం లేదు**

"బెంగాల్ ప్రభుత్వం నుంచి సరైన సహకారం లేదు. అయినా రాష్ట్రంలో దాదాపు 5 కోట్ల మంది ప్రజలతో 'జన్ ధన్ యోజన' ఖాతాలు తెరిపించాం. 'స్వచ్ఛ భారత్ అభియాన్' కింద 85 లక్షల మరుగుదొడ్లు నిర్మించాం. బెంగాల్‌ను పాలిస్తున్న టీఎంసీ సర్కార్ పేదల జీవనోపాధిని లాక్కుంటోంది. 'అటల్ పెన్షన్ యోజన' కింద 56 లక్షల మంది వృద్ధులకు ఊరట కల్పించాం. 'ఉజ్వల యోజన' ద్వారా కోటి కుటుంబాలకు ఎల్‌పీజీ కనెక్షన్‌లను అందించాం. 'కిసాన్ సమ్మాన్ నిధి' ద్వారా 52 లక్షల మంది రైతులకు ప్రత్యక్ష ఆర్థిక సహాయం చేస్తున్నాం" అని మోదీ పేర్కొన్నారు.

**రాష్ట్రంలో హింస, అరాచకత్వం**

"బెంగాల్ దేశ ఆర్థిక వ్యవస్థ దిశను నిర్ణయించేది. నేడు రాష్ట్రం దీనావస్థలో ఉంది. 6 దశాబ్దాల బుజ్జగింపు రాజకీయాలు.. బెంగాల్‌కు కోలుకోలేని నష్టాన్ని తెచ్చిపెట్టాయి. ఓ వైపు ఉపాధి లేక యువత వలస వెళుతోంది. మరోవైపు రాష్ట్రంలోని మహిళలు తమకు భద్రత లేదని భావిస్తున్నారు. స్వామి వివేకానంద, రిషి అరబిందో కలలు కన్న బెంగాల్ నేడు ఓటు బ్యాంకు రాజకీయాలు, హింస, అరాచకత్వంతో నిండిపోయింది. బెంగాల్‌ను పునర్నిర్మిద్దాం. 2026 నాటికి రాష్ట్రాన్ని వికసిత్ బెంగాల్‌గా మారుస్తామని ప్రమాణం చేద్దాం' అని మోదీ అన్నారు.

# ఏడుగురు పాక్ ఉగ్రవాదుల కోసం... 326 రోజుల వేట!

-మొదటిపేజీ తరువాయి

చెందిన ఏడుగురు కరడుగట్టిన టెర్రరిస్టులను భద్రతా దళాలు మట్టుబెట్టాయి. ఈ విజయంతో జమ్మూ ప్రాంతంలో ఉగ్రవాదాన్ని పునరుద్ధరించాలన్న కుట్రకు గట్టి దెబ్బ తగిలినట్లయింది. కిష్టవాడ్ జిల్లాలోని ఛత్రూ అటవీ ప్రాంతంలోని అత్యంత కఠినమైన పర్వతాలు, దట్టమైన అడవులు ఉగ్రవాదులకు స్వర్గధామంగా మారాయి. సరైన రహదారి సౌకర్యం కూడా లేని ఈ ప్రాంతంలో దాక్కున్న ఉగ్రవాదులను ఏరివేసేందుకు భారత సైన్యం, జమ్మూ కశ్మీర్ పోలీస్, సీఆర్‌పీఎఫ్ సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టాయి. భారీ వర్షాలు, గడ్డకట్టే చలి, మంచు వంటి తీవ్రమైన వాతావరణ పరిస్థితులను సైతం లెక్కచేయకుండా, భద్రతా సిబ్బంది దాదాపు ఏడాది పాటు ఇదే ప్రాంతంలో మోహరించి పోరాటం సాగించారు. ఈ ఆపరేషన్ ప్రధాన లక్ష్యం జైషే మహమ్మద్ కమాండర్ సైఫుల్లా సహా ఏడుగురు ఉగ్రవాదుల ఏరివేత. దాదాపు ఐదేళ్ల క్రితం కశ్మీర్‌లోకి చొరబడిన సైఫుల్లా, ఈ ప్రాంతంలో ఉగ్రవాదాన్ని మళ్లీ పునరుద్ధరించాలని ప్రయత్నిస్తున్నాడు. ఒకప్పుడు హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాది బుర్హాన్ వనీ తరహాలో, ఇతడు కూడా యువతను ఆకర్షించేందుకు పోస్టర్ బాయ్‌గా మారే ప్రయత్నం చేశాడు. ఈ మొత్తం ఆపరేషన్ పలు దశల్లో జరిగింది. 2025 ఏప్రిల్-మే నెలల్లో ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా దళాలు మట్టుబెట్టాయి. అనంతరం, ఈ ఏడాది జనవరి 14న 'ఆపరేషన్ త్రాషి-1' పేరుతో తుది దశ ఆపరేషన్‌ను ప్రారంభించారు. ఈ క్రమంలో జనవరి 18న జరిగిన ఎన్‌కౌంటర్‌లో స్పెషల్ ఫోర్సెస్‌కు చెందిన హవల్దార్ గజేంద్ర సింగ్ వీరమరణం పొందారు. ఫిబ్రవరి 4న మరో ఉగ్రవాది ఆదిల్‌ను హతమార్చారు. చివరగా, ఫిబ్రవరి 22న ఛత్రూ సమీపంలోని పస్సెర్‌కుట్ ప్రాంతంలో ఓ మట్టి గుహలో దాక్కున్న సైఫుల్లా సహా చివరి ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా దళాలు చుట్టుముట్టి మట్టుబెట్టాయి.

ఈ విజయం వెనుక భద్రతా దళాల మధ్య అద్భుతమైన సమన్వయం ఉంది. సైన్యంలోని వైట్ నైట్ కార్ప్స్, జమ్మూ కశ్మీర్ పోలీసుల స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్, సీఆర్‌పీఎఫ్ దళాలు కలిసికట్టుగా పనిచేశాయి. స్థానిక ప్రజల నుంచి అందిన సమాచారం, కచ్చితమైన మిలిటరీ ఇంటెలిజెన్స్ ఈ ఆపరేషన్‌లో కీలక పాత్ర పోషించాయి. అత్యాధునిక ఎఫ్‌పీవీ డ్రోన్లు, యూఏవీలు, శాటిలైట్ ఇమేజరీ వంటి టెక్నాలజీని ఉపయోగించి ఉగ్రవాదుల కదలికలను పసిగట్టారు. ఫిబ్రవరి 22న జరిగిన చివరి దాడిలో, ఉగ్రవాదులు ఉన్న గుహలోకి పంపిన 'టైసన్' అనే ఆర్మీ డాగ్ గాయపడింది. దాన్ని వెంటనే చికిత్స కోసం ఎయిర్‌లిఫ్ట్ చేశారు. ఎన్‌కౌంటర్ స్థలం నుంచి ఏకే-47, ఎం4 కార్బైన్ రైఫిళ్లతో పాటు భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్‌తో ఛత్రూ ప్రాంతాన్ని ఉగ్రవాద రహితంగా మార్చామని సైన్యం ప్రకటించింది. "ఉగ్రవాద నెట్‌వర్క్‌కు ఇది భారీ దెబ్బ. మా దళాల సంకల్పం, ధైర్యసాహసాల ముందు ఏ శక్తీ నిలబడలేదని ఇది నిరూపిస్తోంది. మేము సేవ చేస్తాం, మేము రక్షిస్తాం" అని వైట్ నైట్ కార్ప్స్ 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. ఈ విజయంతో కిష్టవాడ్-దోడా ప్రాంతంలో శాంతిని నెలకొల్పే దిశగా భద్రతా దళాలు కీలక ముందడుగు వేశాయి.

# అవినీతిని ప్రశ్నిస్తున్నందుకే టార్గెట్ చేస్తున్నారు

-మొదటిపేజీ తరువాయి

సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన అనంతరం ప్రతి గ్రామాన్ని సందర్శిస్తానని హామీ ఇచ్చారు. ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా.. వెనక్కి తగ్గనని అవినీతిని ప్రశ్నిస్తూనే ఉంటానని అన్నారు. వేలూర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో విజయ్ మాట్లాడుతూ..ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో అవినీతి, నేరాలను అరికట్టడంలో స్టాలిన్ ప్రభుత్వం విఫలమయ్యిందని విజయ్ ఆరోపించారు. త్వరలో జరగనున్నవి ఎన్నికలు కాదని తమిళనాడు ప్రజలకు, అవినీతి ప్రభుత్వానికి మధ్య యుద్ధమని అన్నారు. ఈ యుద్ధంలో ప్రజలే విజయం సాధిస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో తనను ఎలాగైనా ఓడించాలనే ఆలోచనతో స్టాలిన్ కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకేకు ఓటు వేస్తే భాజపాకు వేసినట్లేనని అన్నారు. ఎన్నికల్లో ఓటమి భయంతో స్టాలిన్ ప్రభుత్వం భాజపాతో పొత్తు పెట్టుకోవాలని చూస్తోందని ఆరోపించారు. పరిస్థితులకు అనుగుణంగా మారిపోవడం ఆ పార్టీ నేతలకు అలవాటేనని దుయ్యబట్టారు.

తాము అధికారంలోకి వస్తే రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడడానికి కఠిన చర్యలు తీసుకుంటానని విజయ్ అన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవ్వడానికి విద్యార్థులు లక్షల రూపాయలు వెచ్చించే అవసరం లేకుండా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే శిక్షణనిస్తామన్నారు. రాష్ట్రంలోని అన్ని మారుమూల ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు పరిశుభ్రమైన, సురక్షితమైన బాత్రూంలను ఏర్పాటు చేస్తామన్నారు. దేశంలోనే సురక్షితమైన రాష్ట్రంగా తమిళనాడును మారుస్తానని ప్రతిజ్ఞ చేశారు.

# ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రహార్

-మొదటిపేజీ తరువాయి

వహించరాదన్నది ఈ విధానంలోని ప్రధాన అంశం. నిఘా ఆధారంగా ఉగ్రవాద హింసను నిరోధించడం, ఉగ్రవాదులకు, వారికి ఆర్థిక సాయం చేసేవారికి, మద్దతు దారులకు నిధులు, ఆయుధాలు, ఆశ్రయం అందకుండా చేయడం ఈ పథకం ఉద్దేశమని హోంశాఖ పేర్కొంది. దేశ విదేశాల నుంచి ఎదురవుతున్న ఉగ్రవాద ముప్పును నిర్మూలించేందుకు ఈ విధానానికి ఏడు స్తంభాల్లాంటి అంశాలను నిర్దేశించారు. ఉగ్రవాద నిరోధం, సత్వర స్పందన, అంతర్గత సామర్థ్యాల వినియోగం, మానవహక్కులు, చట్టపాలన ఆధారిత పద్ధతుల అనుసరణ, ఉగ్రవాదానికి దారితీస్తున్న మత ఛాందస భావనల కట్టడి, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న ప్రయత్నాలతో జతకలవడం అనే ఈ అంశాలు ప్రహార్‌కు పునాది వంటివని స్పష్టం చేసింది. భారత్ పొరుగున తరచూ అస్థిర పరిస్థితులు నెలకొంటున్న కారణంగా ఆయా ప్రాంతాల్లో అరాచక పరిస్థితులు తలెత్తుతున్నాయి. మన ప్రాంతంలోని కొన్ని దేశాలు ఉగ్రవాదాన్ని తమ ప్రభుత్వ విధానంగా ఎంచుకున్నాయని హోంశాఖ తన విధాన పత్రంలో పాకిస్థాన్‌ను పరోక్షంగా ప్రస్తావించింది.

"భారత్ ఉగ్రవాదాన్ని ఏ మతానికీ, జాతీయతకూ, నాగరికతకూ ముడిపెట్టదు. ఉగ్రవాదం ప్రకటిత, అప్రకటిత లక్ష్యాలు ఏవైనా భారత్ ఎల్లవేళలా దాన్ని నిర్ద్వంద్వంగా ఖండిస్తూనే ఉంది" అని హోంశాఖ విధాన పత్రం పేర్కొంది. కొన్ని వర్గాల్లో నెలకొన్న దారిద్ర్యం, నిరుద్యోగం వంటి సమస్యల్ని ప్రతికూల శక్తులు తమకు అనుకూలంగా ఉపయోగించుకోకుండా నిరోధించేందుకు భారత ప్రభుత్వం ఆయా సమస్యల పరిష్కారానికి అనేక పథకాలు ప్రవేశపెట్టిందని పేర్కొంది. ఉగ్రవాద కార్యకలాపాల కోసం సమాచార, కమ్యూనికేషన్ల సాంకేతిక పరిజ్ఞానాన్ని దురుపయోగ పరిచే తత్వాన్ని నిర్మూలించేందుకు తాము కంకణబద్ధులమై ఉన్నామని విధానపత్రం తెలిపింది. ఇందుకోసం సాంకేతిక పరిజ్ఞాన రంగంలో పెట్టుబడులు పెంచడంతోపాటు, ప్రైవేటు భాగస్వామ్యానికి వీలు కల్పిస్తున్నట్టు వెల్లడించింది.

# కొయ్యలగూడెం మండలంలో రవాణా సమస్యకు పవన్ పరిష్కారం

ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవతో ఏలూరు జిల్లా, కొయ్యలగూడెం మండలంలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న రవాణా సమస్యకు పరిష్కారం లభించింది. ఆయన ప్రత్యేక చొరవతో ఎర్రంపేట--రాజవరం గ్రామాల మధ్య 3 కిలోమీటర్ల డొంక రోడ్డు నిర్మాణం కేవలం మూడు నెలల్లోనే పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. గతంలో ఈ దారి బురదమయంగా ఉండి, ప్రయాణానికి తీవ్ర ఇబ్బందికరంగా ఉండేది. స్థానికులు, రైతులు పడుతున్న కష్టాలను తెలుసుకున్న పవన్ కల్యాణ్, ఈ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) నుంచి రూ.60 లక్షల నిధులు మంజూరు చేయించి పనులను వేగవంతం చేశారు. ఈ రోడ్డు నిర్మాణంతో దాదాపు 12,500 మంది ప్రజలకు రవాణా కష్టాలు తీరాయి. ముఖ్యంగా రైతులకు ఇది ఎంతో ప్రయోజనకరంగా మారింది. ఇకపై తమ పొలాలకు సులభంగా వెళ్లడంతో పాటు, వ్యవసాయ పరికరాలను తరలించడం, పండిన పంటను మార్కెట్‌కు వేగంగా, తక్కువ ఖర్చుతో చేరవేయడం వీలవుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


పవన్ కల్యాణ్ పర్యవేక్షణ, అధికారుల సమన్వయంతోనే పనులు రికార్డు సమయంలో పూర్తయ్యాయని స్థానికులు చెబుతున్నారు. ఈ కొత్త రహదారితో గ్రామీణ ప్రాంతంలో ఆర్థిక కార్యకలాపాలు ఊపందుకుంటాయని భావిస్తున్నారు.

# నక్కపల్లిలో తాగునీటి సమస్య - పరిష్కరించాలని మహిళలు వినతి

**నక్కపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 23:**మండల కేంద్రం నక్కపల్లి సాయినగర్ కాలనీ లో తాగునీటి సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. సోమవారం సాయి నగర్ కాలనీ మహిళలు పంచాయతీ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొంతకాలంగా సాయి నగర్ కాలనీకి తాగునీరు రావడంలేదని తెలిపారు. తమ కాలనీకి తాగునీరు సరఫరా చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. తక్షణమే సమస్యను పరిష్కరించాలని లేకపోతే ఈ విషయం పై ఉన్నతాధికారుల దృష్టి కి తీసుకుని వెళతామని మహిళలు అన్నారు.



# రాజయ్యపేట భూములకు 32 లక్షలు చెల్లించాలి



**నక్కపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 23 :** మత్స్యకార గ్రామం రాజయ్య పేటలో మిగిలి ఉన్న జిరాయితీ భూమికి రూ.32 లక్షలు పరిహారం చెల్లించాలని ఆర్డీవో వివి రమణ కు వినతి పత్రం అందజేశారు. సోమవారం రాజయ్య పేట గ్రామానికి చెందిన పలువురు రైతులు ఆర్డీఓ రమణను కలిసి తమ డిమాండ్లను తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీఐఐసీ 2016లో అప్పటి మార్కెట్ వాల్యూ ప్రకారం అప్పట్లో జిరాయితి భూమికి రూ.18 లక్షలు నష్ట పరిహారం చెల్లించారన్నారు. ఇప్పుడు కూడా అదే జరాయితి భూమికి రూ 18 లక్షలు నష్టపరహారం చెల్లిస్తానని చెప్పడం దారుణం అన్నారు రాజయ్య పేట గ్రామంలో ఇంకా పది ఎకరాల జరాయితి భూమి ఉందని దానికి ప్రస్తుతం ఉన్న రేటు ప్రకారం రూ.32 లక్షలు చెల్లించాలని కోరుతూ ఆర్డీఓ రమణకు వినతిపత్రం అందజేశారు. ఈ సమస్యను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్తానని ఆర్డీఓ తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు 10 వార్డ్ మెంబర్ మైలపల్లి మహేష్ బాబు,బి అప్పలరాజు, డి వీర్రాజు, డి స్వామి, డి తాతలు తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి కమిటీల ఏర్పాటుపై విస్తృత చర్చ

**నక్కపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 23:**పాయకరావుపేట నియోజకవర్గంలో మండల కమిటీ ల ఏర్పాటుపై హోం మంత్రి అనిత నివాసంలో సోమవారం నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశం పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు హాజరయ్యారు. తెలుగుదేశం పార్టీ జిల్లా, నియోజకవర్గ, మండల కమిటీల కోసం చర్చించారు. ఈ కమిటీల్లో 33% మహిళలు ఉండేలా చూడాలన్నారు. హోం మంత్రి అనిత జన్మదినం సందర్భంగా ఏర్పాటుచేసిన క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణ, జట్ల నమోదు, ఏర్పాట్లపై విస్తృతంగా చర్చించారు. మార్చి మొదటి వారంలో మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి.

గ్రామపంచాయతీ ప్రాతిపదికన జట్లు ఏర్పాటు చేసి టోర్నమెంట్‌లో పాల్గొనవచ్చని వెల్లడించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి జట్లు నమోదు



చేసుకుని టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని నాయకులు కోరారు. ఈ సమావేశంలో పాయకరావుపేట నియోజకవర్గం నాలుగు మండలాల అధ్యక్షులు, సమన్వయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# అచల చిట్ ఫండ్ సభ్యులకు నగదు చెక్కుల పంపిణీ



**వరంగల్ సిటీ బ్యూరో పెన్ సత్తా, ఫిబ్రవరి 23:** వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి వి.బి. నిర్మలా గీతాంబ

వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అచల చిట్ ఫండ్ యాజమాన్యం నుండి సభ్యులకు నగదు చెక్కులను అందజేయడం జరిగింది.

ఈ సందర్భంగా అర్హులైన 79 మంది లబ్ధిదారులకు రూ.3,67,27,224/- చెక్కులను గౌరవ అతిథి వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి. నిర్మలా గీతాంబ చేతుల మీదుగా అందజేయడం జరిగింది. అర్హులైన లబ్ధిదారులు తమ గుర్తింపు కార్డులు మరియు సంబంధిత పత్రాలతో న్యాయ సేవాధికార సంస్థ వరంగల్ చైర్ పర్సన్ ముందు హాజరయ్యారు.

చిట్ఫండ్ యాజమాన్యం మరియు బాధితుల పట్ల న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ న్యాయమూర్తి ఎం.సాయికుమార్ ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వ న్యాయవాది తీగల జీవన్ గౌడ్ పారదర్శకంగా వ్యవహరించారు.

చిట్ ఫండ్ లో సభ్యులుగా చేరి డబ్బులు చెల్లించిన వారికి న్యాయసేవాధికార సంస్థ ద్వారా తిరిగి చెల్లించడం జరిగినది, వారి ఆర్థిక ఇబ్బందులను తగ్గించుట కొరకు న్యాయ సేవాధికార సంస్థలు కృషి చేస్తాయని ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. చిట్ఫండ్ సంస్థ నుండి డబ్బులు రావాల్సిన లబ్ధిదారులకు రాష్ట్రవ్యాప్తంగా మొట్టమొదటిసారిగావారు చెల్లించిన డబ్బును తిరిగి చెల్లించడం జరిగిందని పేర్కొన్నారు.

చిట్ ఫండ్ సంస్థలు వారి ఇష్టమైన రీతిన ప్రభుత్వ నియమ నిబంధనలను, చట్ట పరిధిలో కార్యకలాపాలు చేయాలని, వారి వల్ల ఆర్థికంగా నష్టపోయిన బాధితులకు తగిన పరిహారం అందించుట మరియు వారికి న్యాయ పరిరక్షణ కల్పించుట ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు.

ఈ సందర్భంగా బాధితులు తమకు న్యాయం జరిగిందని, న్యాయ సేవాధికార సంస్థ ప్రజల హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉంటుందని మరోసారి నిరూపించుకుందని వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.సాయికుమార్, బాధితుల తరఫున న్యాయవాది వై. విశ్వేశ్వర రావు, అచల చిట్ఫండ్ తరపున సీనియర్ న్యాయవాది చొల్లేటి రామకృష్ణ, వరంగల్ జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాసరావు, అచల చిట్ ఫండ్ సంస్థ చైర్మన్ పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# బీఎస్ఎన్ఎల్ టవర్ మంజూరు.

- ప్రతి ఇంటికి కనెక్షన్ పాఠశాలకు ఉచిత సేవలు..




**రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం, పెన్ సత్తా, ఫిబ్రవరి 23::**నెర్రపల్లి గ్రామంలో మొబైల్ సిగ్నల్ సమస్యను పరిష్కరించేందుకు కీలక నిర్ణయం తీసుకున్నట్లు బీఎస్ఎన్ఎల్ అధికారులు తెలిపారు. బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ శ్రీధర్, ఉప జనరల్ మేనేజర్ దినేష్, అధికారి జితేందర్ సింగ్ గ్రామాన్ని సందర్శించి స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొడ్డెండ్ల హేమలత శ్రీహరి, ఉపసర్పంచ్ వేణుగోపాల్ రెడ్డి సమక్షంలో అధికారులు గ్రామానికి బీఎస్ఎన్ఎల్ టవర్ మంజూరు చేస్తామని ప్రకటించారు. గ్రామ పాలకవర్గం టవర్ ఏర్పాటుకు తగిన భూమిని చూపిస్తే వెంటనే సర్వే నిర్వహించి పనులు ప్రారంభిస్తామని జనరల్ మేనేజర్ శ్రీధర్ తెలిపారు. అలాగే గ్రామంలోని ప్రతి ఇంటికి బీఎస్ఎన్ఎల్ కనెక్షన్ అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, ప్రభుత్వ పాఠశాలకు ఉచితంగా బీఎస్ఎన్ఎల్ కనెక్షన్ ఇవ్వనున్నట్లు ప్రకటించారు. గ్రామంలో ప్రస్తుతం ఉన్న సిగ్నల్ సమస్య పూర్తిగా తొలగిపోయేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజలు బీఎస్ఎన్ఎల్ అధికారుల నిర్ణయాన్ని స్వాగతిస్తూ, టవర్ ఏర్పాటు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.

# తెలంగాణ ఉద్యమకారుల కల సాకారం..

- హైకోర్టు తీర్పుకు ఎల్బీనగర్‌లో ఘన స్వాగతం..



**రంగారెడ్డి జిల్లా, ఎల్బీనగర్, ఫిబ్రవరి 23, పెన్ సత్తా, ఫిబ్రవరి 23:**తెలంగాణ ఉద్యమకారుల దీర్ఘకాల పోరాటానికి న్యాయం చేకూర్చిన హైకోర్టు తీర్పును హర్షిస్తూ తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఎల్బీనగర్ చౌరస్తాలో ఘన కార్యక్రమం నిర్వహించారు. కోర్టులో ఉద్యమకారుల తరఫున వాదించి న్యాయం సాధించేందుకు కృషి చేసిన న్యాయవాదులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఎల్బీనగర్ సర్కిల్‌లోని మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తెలంగాణ రాష్ట్రం కోసం అమరుడైన శ్రీకాంత్ చారి, ఉద్యమ స్ఫూర్తిదాయకుడు ప్రొఫెసర్ జయశంకర్‌తో పాటు ఇతర మహనీయులను స్మరించుకున్నారు. “ఈ తీర్పు తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక” అని నేతలు పేర్కొన్నారు. ఉద్యమకారుల తరఫున హైకోర్టులో నిలబడి వాదించిన న్యాయవాదులకు తెలంగాణ ఉద్యమం వందనాలు తెలియజేస్తున్నట్లు ప్రకటించారు. ఈ విజయం తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యవర్గంతో పాటు వివిధ జిల్లాల్లో పోరాటం సాగించిన ప్రతి ఉద్యమకారుడికి చెందుతుందని స్పష్టం చేశారు. తెలంగాణ సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరుల ఆశయాలను నిలబెట్టే దిశగా ఉద్యమం కొనసాగుతుందని నేతలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం ఉపాధ్యక్షుడు జెనిగే విష్ణువర్ధన్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంత యాదిరెడ్డి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కారింగుల నరేందర్ గౌడ్, ఆడాల యాదయ్య, ఈదుల పరశురాం, ఘోర శ్యాంసుందర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, మారోజు రామాచారి, దేవరకొండ నరేష్ చారి, ఉపేందర్ యాదవ్, బింగు శ్రీనివాస్, బర్రె రాజ్ కుమార్, మామిడి కిషోర్ తదితరులు హాజరయ్యారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత -7 వార్డ్ మెంబర్



**చేగుంట: పెన్ సత్తా, ఫిబ్రవరి 23:**చేగుంట మండల్ పొలంపల్లి గ్రామానికి చెందిన, కొండి నర్సింలు అనారోగ్యంతో మరణించారు,వారి ఆత్మకు శాంతి చేకూరాలని వారు తెలుపుతూ వారి కుటుంబ సభ్యులను పరమర్శించి, నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం 50 కేజీ బియ్యం అందజేసిన, పొలంపల్లి 7 వార్డ్ మెంబర్ గరిగె మంజుల అందజేశారు, ఈ కార్యక్రమంలో గరిగె, మంజుల యాదగిరి, గరిగె గణేష్, పి ప్రశాంత్, సాధు తదితరులు పాల్గొన్నారు,

## డిప్లమా కోర్సులతో విద్యార్థులకు బంగారు భవిష్యత్తు.



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా, ఫిబ్రవరి 23:**మణుగూరులోని ప్రభుత్వ మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాల నందు ఎలక్ట్రికల్, మెకానికల్, మైనింగ్ బ్రాంచ్‌లతో పాటు కొత్తగా డిప్లొమా ఇన్ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ కోర్సు ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యోగితా రాణా, టిజి ఎస్ బి టెట్ కమిషనర్ దేవసేన, కార్యదర్శి పుల్లయ్య ఆదేశాల మేరకు కళాశాల ప్రిన్సిపాల్ బి. నాగముని నాయక్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పి.వి.వి.రమణమూర్తి ఆధ్వర్యంలో పాలీసెట్ 2026 పై అవగాహన కల్పించబడింది. రాష్ట్రంలో ప్రవేశపెట్టిన కొత్త డిప్లొమా కోర్సులు డిప్లొమా పూర్తిచేసిన తర్వాత లభించే ఉద్యోగ అవకాశాలపై ప్రత్యేక వీడియోను ప్రదర్శించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలో 10వ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై తల్లిదండ్రులు,ఉపాధ్యాయుల సమక్షంలో అవగాహన కల్పించి ఈ అవకాశాన్ని ఏజెన్సీ ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జ్ హెడ్‌లు గా కె. ప్రతాప్, బి. కృష్ణ, కె. ప్రసాద్ వ్యవహరించారు.
ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, ఇన్‌చార్జ్ హెడ్‌లు సిబ్బంది సభ్యులను ఓఎస్ డి అభినందించారు.

## మైనర్,మానసిక రోగి పై అత్యాచారం, వ్యక్తికి 20 సంవత్సరముల కఠిన కారాగార శిక్ష.




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా, ఫిబ్రవరి 23:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ( ఫోక్సో స్పెషల్ సెషన్స్ జడ్జి) ఎస్. సరిత సోమవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా. బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామము కు చెందిన ఇడ్డీ రంగా తన ఫిర్యాదులో 2019 మార్చి 19 న బూర్గంపాడు పోలీసు వారికి ఇచ్చిన ఫిర్యాదు లో తన తమ్ముడు ఇడి భాస్కర్ తన మరదలు అరుణలు మరణించిన కారణంగా వారి మైనర్ పిల్లలు కుమార్తె ,కుమారుడు తన వద్దనే ఉంచుకొని వారి మంచి చెడు చూసుకుంటూ ఉంటున్నారని, తన తమ్ముడి కూతురు మైనరు,మానసిక రోగి యని, తను 19/03/2019 తన ఇంటి నుండి నగదు, బంగారు , తన సెల్ ఫోను తీసుకొని వెళ్ళినదని తన బంధువులకు సమాచారం ఇచ్చినప్పటికీ ఆమె ఆచూకీ దొరకలేదు. తదుపరి తన తమ్ముడి కుమారుడు రాత్రి సమయంలో ఆటోలో మైనరు బాలిక వెళ్ళిపోయినదని చెప్పగా ఆమె ఆచూకీ తెలుపమని బూర్గంపాడు పోలీస్ వారికి ఫిర్యాదు చేయగా అప్పటి హెడ్ కానిస్టేబుల్ నాగయ్య కేసు నమోదు చేసుకున్నారు. అప్పటి పాల్వంచ డీఎస్పీ జి. మధుసూదన్ రావు దర్యాప్తులో తను మూడు వారాల గర్భవతి అని ఖమ్మం కోర్టు కు నివేదించగా అప్పటి మొదటి అదనపు జిల్లా జడ్జ్ (ఫోక్సో స్పెషల్ సెషన్స్ జడ్జి) వి .బాల భాస్కర్ 2019 జూన్ 11న ప్రెగ్నెన్సీని తీసివేయాలన్న అనుమతి ప్రకారము ఆ మైనర్ యొక్క ప్రెగ్నెన్సీను తీసివేశారు. దర్యాప్తులో సారపాక గాంధీనగర్ కు చెందిన నూనావత్ నవీన్ ఈ అత్యాచారానికి పాల్పడినాడని దర్యాప్తు ఆధారంగా అతనిపై అప్పటి పాల్వంచ డిఎస్పి కె.ఆర్.కె ప్రసాద్ కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. కోర్టులో 13 మంది సాక్షులను విచారించారు. కోర్టు లో వాదోపవాదాలు విన్న అనంతరం నూనావత్ నవీన్ పై నేరం రుజువు అయినది. కోర్టు తీర్పు సెక్షన్ 6 ఫోక్స్ యాక్ట్ ప్రకారం 2ూ సం రాలు కఠిన కారాగార శిక్ష ,రు.5000/- జరిమానా, సెక్షన్ భారత శిక్షా స్మృతి 336(ఎ ) ప్రకారం 10 సంవత్సరముల కఠిన కారాగార శిక్ష , ఐదువేలు జరిమానా మొత్తం పదివేల రూపాయల జరిమాన చెల్లించని యెడల ఆరు నెలలు కఠినకారా గార శిక్షవిధిస్తూ, రెండు కటిన కారాగారా శిక్షలు ఏకకాలంలో అనుభవించాలని తీర్పు చెప్పారు. అప్పటి స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెలగల నాగిరెడ్డి, ప్రాసిక్యూషన్ నిర్వహించారు. కోర్టు నోడల్ ఆఫీసర్ డి.రాఘవయ్య, కోర్టు లైజాన్ ఆఫీసర్ వీరభద్రం, ( కోర్టు డ్యూటీ ఆఫీసర్) పి.సి.ఎండి అక్రమ్ లు సహకరించారు.

# పదో తరగతి పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి.



జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా, ఫిబ్రవరి 23:**మార్చి 14 నుండి ఏప్రిల్ 16 వరకు నిర్వహించనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో పబ్లిక్ పరీక్షల నిర్వహణకు నియమించిన చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, కస్టోడియన్లు, జాయింట్ కస్టోడియన్లు, సి-సెంటర్ కస్టోడియన్లు, మండల విద్యాశాఖాధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.
జిల్లా వ్యాప్తంగా మొత్తం 73 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ పరీక్షలకు 12,731 మంది రెగ్యులర్ విద్యార్థులు, 404 మంది ప్రైవేట్ అభ్యర్థులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. పరీక్షలు ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించబడతాయని వెల్లడించారు.
విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన అత్యంత కీలక అంశం కావడంతో పరీక్షల నిర్వహణలో అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, కస్టోడియన్లు, జాయింట్ కస్టోడియన్లు మరియు సెంటర్ సూపరింటెండెంట్లు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆదేశించారు. మండల విద్యాశాఖాధికారులు ( ఎంఈఓ లు), రెవెన్యూ డివిజనల్ అధికారులు (ఆర్డీవో లు) తమ పరిధిలోని పరీక్షా కేంద్రాలను క్రమం తప్పకుండా పర్యవేక్షించి నివేదికలు సమర్పించాలని సూచించారు.
గతంలో చోటుచేసుకున్న సంఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశ్నపత్రాల భద్రత, రవాణా, భద్రపరిచే విధానం, సమయపాలన వంటి అంశాల్లో ఎటువంటి లోపం ఉండకూడదని స్పష్టం చేశారు.
పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో సెక్షన్ 163 బి ని అమలు చేయడంతో పాటు, పోలీస్ శాఖ ద్వారా పర్యవేక్షణను బలోపేతం చేయాలని అన్నారు . కాపీచేసే చర్యలను పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక ఫ్లయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్లు పరిశీలక బృందాలను నియమించాలని ఆదేశించారు.
విద్యార్థులు ఒత్తిడి లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి అనుకూల పరిస్థితులు కల్పించాలని తెలిపారు. పరీక్షా కేంద్రాలలో తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు, సరిపడ ఫర్నిచర్, పరిశుభ్రమైన మరుగు దొడ్లు వంటి మౌలిక వసతులు సమృద్ధిగా ఉండేలా చూడాలని సూచించారు. ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థులకు రైటర్ సౌకర్యం, ర్యాంపులు తదితర అవసరమైన సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు.
అన్ని పరీక్షా విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది విధిగా తమ ఐడీ కార్డులను ధరించాలని కలెక్టర్ స్పష్టంగా ఆదేశించారు. ఐడీ కార్డు లేకుండా ఎవరినీ పరీక్షా కేంద్రాల లోపలికి అనుమతించరాదని ఆదేశించారు .
చీఫ్ సూపరింటెండెంట్లు ప్రభుత్వ నియమావళిని ఖచ్చితంగా పాటిస్తూ పరీక్షల నిర్వహణలో పారదర్శకత, నిష్పాక్షికత పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాలలో మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు నిషేధించబడినవని, నియమావళిని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి, అసిస్టెంట్ డైరెక్టర్ శంభు ప్రసాద్, పరీక్షల సహాయ కమిషనర్ మాధవరావు, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సంబంధిత శాఖల

# కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

మహిళా సంఘాల భవనాలకు భూమి పూజ చేసిన, సి హెచ్, శ్రీనివాస్ రెడ్డి



**చేగుంట : పెన్ సత్తా, ఫిబ్రవరి 23:** చేగుంట మండల్ ఇబ్రహీంపూర్ గ్రామంలో మహిళలకు సముచిత స్థానం ప్రజాపాలన ప్రభుత్వం కల్పిస్తుందని దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సి హెచ్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు.సోమవారం చేగుంట మండలం పరిధిలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో మహిళా సమైక్య భవన నిర్మాణానికి సర్పంచ్ జ్యోతి రాంరెడ్డి నిర్వహించిన భూమి పూజ కార్యక్రమం సి హెచ్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలతో, పాటు ఉచిత బస్సు ప్రయాణం,అవసరమైన సదుపాయాలను కల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి సమస్యకు పరిష్కారం చూపిస్తూ మహిళల పేరిటనే ఇందిరమ్మ ఇండ్లను అందించడం జరుగుతుందని, ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతంగా జరుగుతుందని పేర్కొన్నారు. సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రజాపాలన ప్రభుత్వం అడుగులు వేస్తుందని ప్రజలందరూ సంపూర్ణ మద్దతు తెలియజేయలని వారు సూచించారు. ఈ కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వడ్ల నవీన్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, ఉపసర్పంచ్,వడియారం సర్పంచ్ సాయికుమార్ గౌడ్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు, ముజామిల్, నర్సింలు, ఆంజనేయులు, ఫకీర్ నాయక్, మాజీ సర్పంచ్ భాస్కర్, ఉప సర్పంచ్ శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మోహన్ నాయక్, మండల్ యూత్ నాయకులు సంద్రంగు శ్రీకాంత్, సతీష్, మహేష్, రాజు, వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రూ.1.98కోట్ల విలువైన సంక్షేమ చెక్కులు అందించిన ఎమ్మెల్యే



- ప్రతి పేదకుటుంబానికి సంక్షేమ ఫలాలు అందాలి
- పేద ఇంటి ఆడబిడ్డలకు ప్రభుత్వ భరోసా అభినందనీయం
- ఆపదలో ఉన్నవారికి అండగా సీఎం రిలీఫ్ ఫండ్
- అభివృద్ధి, ప్రజా సంక్షేమంకోసం నిరంతరం కృషిచేస్తున్నా
- కార్పొరేషన్ ఫలితం అభివృద్ధిపై ప్రజలు ఇచ్చిన తీర్పుకు నిదర్శనం
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా, ఫిబ్రవరి 23:**కొత్తగూడెం నియోజకవర్గ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా, పేద వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా కొత్తగూడెం నియోజకవర్గ శాసనసభ సభ్యులు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సోమవారం భారీ ఎత్తున సంక్షేమ ఫలాలను పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కొత్తగూడెం టౌన్, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్ మండలాలకు చెందిన 168 మంది లబ్ధిదారులకు రూ. 1.68 కోట్ల విలువైన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ.. పేద కుటుంబాల్లో ఆడబిడ్డల పెళ్లిళ్లు భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాలను అమలు చేస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నియోజకవర్గ పరిధిలో ఒకే దఫాలో పెద్దమొత్తంలో 307 మందికి కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులు మంజూరుకావడం హర్షణీయమన్నారు. అనంతరం, అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతూ చికిత్స పొందిన 72 మంది బాధితులకు రూ. 30.75 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను కూడా అందజేశారు. ప్రజాపక్షం వహించే నాయకుడిగా, నియోజకవర్గంలోని ప్రతి పేదవాడికి ప్రభుత్వ సాయం అందే వరకు నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే తన తొలి ప్రాధాన్యతని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పారదర్శకంగా పథకాలను అందజేస్తున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్ లలితకుమారి, తహసీల్దార్లు పుల్లయ్య, కృష్ణప్రసాద్, నాగరాజు, కార్పొరేటర్లు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఫ్లెక్స్ షాప్ లు బంద్.

యూనియన్ అధ్యక్షులు విజ్జిగిరి రాజా కిరణ్.






**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా, ఫిబ్రవరి 23:**భద్రాచల్ మరియు సారపాక పట్టణంలోని మంగళవారం ఫ్లెక్సీ ప్రింటింగ్ షాపులు బంద్ అని భద్రాచలం ఫ్లెక్స్ ప్రింటింగ్ అసోసియేషన్ అధ్యక్షులు విజ్జిగిరి రాజా కిరణ్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఒత్తిడితో కూడిన వ్యాపారానికి ఒక చిన్న విరామం ఇవ్వాలనే ఆలోచనతో... యూనియన్ అంతా కలిసి పిక్నిక్ కి వెళ్లడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ పిక్నిక్ లో ఓనర్స్, వర్కర్స్ కలిసి పసందైన విందు, ఆటపాటలు, లక్కీ డీప్ వంటి కార్యక్రమాలు ఉంటాయని ఆయన తెలిపారు. అదేవిధంగా బుధవారం పెళ్లిళ్లు, పుష్పాలంకరణ వంటి శుభకార్యాలు ఏమైనా ఉన్నట్లయితేనేడు అత్యవసరంగా వచ్చి ఫ్లెక్సీలు తయారు చేసుకోవాల్సిందిగా యూనియన్ తరపున కస్టమర్లకు తెలియజేశారు.

## మరణానంతరం శరీరాన్ని ప్రభుత్వ కళాశాలకు రాసి ఇచ్చిన ఆర్.ఎం.పి వైద్యురాలు కొండూరి అనూష

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా, ఫిబ్రవరి 23:**మరణానంతరం శరీరాన్ని ప్రభుత్వ కళాశాలకు రాసి ఇచ్చిన ఆర్.ఎం.పి వైద్యురాలు కొండూరి అనూష. ఈ సందర్భంగా ఝాన్సీ రాణి నేత్ర, అవయవ ప్రోత్సహకుల సంఘం వ్యవస్థాపకురాలు కమల రాణి కొచ్చెర్ల మాట్లాడుతూ అనూష తన మరణానంతరం వైద్యాకాలశాలకు తన శరీరాని ఇస్తానని కుటుంభసభ్యుల సమక్షశీ లో రాసి ఇవ్వడం చాలా సంతోషాశీగా ఉందని తెలిపారు.వైద్య విద్యార్థులు ప్రయోగానికి ఉపయోగ పడేలా ఈ నిర్ణయం తీసుకోవడం ఆనందం వ్యక్తం చేసారు.
మరణానంతరం కూడా కొన్ని జీవితాల్లో వెలుగులు నింపే సమాజ స్పృహ ఉన్న వాళ్ళు అవసరం.
ఇంకెవరైనా నేత్ర, అవయవాలు దానం చేసేవాళ్ళుంటే ఈ నెంబర్ను సంప్రదించాలని 8919569524. ఝాన్సీ రాణి నేత్ర, అవయవ ప్రోత్సహకుల సంఘం వ్యవస్థాపకురాలు కమల రాణి కొచ్చెర్ల అన్నారు.



# కలెక్టరేట్ వద్ద ధర్నాకు తరలిన షాద్ నగర్ జర్నలిస్టులు

- అక్రిడియేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరం కొనసాగాలి..
- పార్టీల పంచాయితీలకు జర్నలిస్టులను బలి చేస్తారా..?
- టీడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, సీనియర్ జర్నలిస్ట్ కేపి
- జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున హాజరైన జర్నలిస్టులు
- డిఆర్ఓ సంగీతకు వినతి పత్రం అందజేసిన జర్నలిస్టులు
- జీవో సవరణ అయ్యేంతవరకు జిల్లా అక్రిడియేషన్ కమిటీ వేయొద్దని డిపిఆర్ఓ కార్యాలయంలో వినతిపత్రం సమర్పణ
- జర్నలిస్టులకు సంఘీభావం తెలిపిన సిపిఐ నేత పానుగంటి పర్వతాలు

**షాద్ నగర్ పెన్ సత్తా, ఫిబ్రవరి 23:**రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య పంచాయితీలకు జర్నలిస్టులను బలి చేయొద్దు.. అక్రిడియేషన్ కార్డుల ప్రక్రియను నిరంతరం చేపట్టాలి.. గుర్తింపు లేని జర్నలిజం ఎందుకు..? ఎవరిని ఇబ్బంది పెట్టేందుకు ఈ నిర్ణయం.. అంటూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండి ఖాజాపాషా (కేపి) ప్రశ్నించారు. అక్రిడియేషన్ కార్డులలో కోత విధించడంపై రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు జిల్లా శాఖ అధ్యక్ష కార్యదర్శులు శేరీబాయి గణేష్, సైదులు ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘు, కౌన్సిల్ సభ్యులు, సురేష్ ఎండి ఖాజా పాషా, జిల్లా నాయకులు సుదర్శన్, ఎలికట్ట శ్రీశైలం తదితరులు హాజరయ్యారు. జిల్లా నలుమూలల నుండి జర్నలిస్టులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులకు ఉన్న ఒక్క గుర్తింపు కార్డును తొలగిస్తే ఇక వారికి ప్రయోజనం ఏముంటుందని? ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో అర్హత లేని వారికి కార్డులు ఇవ్వమంటూ ప్రకటించిన ప్రభుత్వం ఇప్పుడు అర్హత ఉన్న వారిని సైతం పక్కన పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వ నిర్ణయం కారణంగా 20 నుంచి 30 సంవత్సరాల పాటు పనిచేస్తున్న పాత్రికేయులు కూడా గందరగోళంలో పడ్డారని, తీవ్ర నిరాశకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే దీనిపై స్పందించి అర్హత ఉన్నవారికి అందజేయాలని కోరారు. లేదంటే ఊరుకునేది లేదని ఆందోళన మరింత పెద్దది అవుతుందని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. అధికార ప్రతిపక్ష పార్టీల మధ్య ఉన్న ప్రచండ యుద్ధాన్ని జర్నలిస్టులపై ప్రయోగించోదని పేర్కొన్నారు. పట్టణ అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న జర్నలిస్టులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. వారందరికీ న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ సమస్యపై వెంటనే స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జీవోలు సవరించాలని లేదా రద్దు చేయాలని పాత విధానం ప్రకారమే అక్రీడేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రంగారెడ్డి డిఆర్ఓ సంగీతకు వినతిపత్రాన్ని అందజేశారు.

అనంతరం జిల్లా నాయకులతోపాటు డిపిఆర్ఓ ను కలిసి వినతి పత్రాన్ని అందించారు.






అదేవిధంగా అక్రిడియేషన్ జిల్లా కమిటీ ఏర్పాటుకు ముందే ప్రభుత్వ నిబంధనలు సవరణ జరగాలని లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిపిఐ రాష్ట్ర నాయకులు పనుగంటి పర్వతాలు తదితరులు పెద్ద ఎత్తున జర్నలిస్టులకు సంఘీభావం తెలియజేస్తూ అక్రిడేషన్ కార్డులను వెంటనే జర్నలిస్టులకు మంజూరు చేయాలని ప్రభుత్వం పై ఒత్తిడి తెస్తామని తెలిపారు.

భారీగా తరలిన జర్నలిస్టులు..

అక్రేడియేషన్ కార్డులపై ప్రభుత్వ నిర్ణయానికి నిరసనగా కలెక్టరేట్ వద్ద జరిగిన ఆందోళనకు షాద్ నగర్ మంచి భారీ ఎత్తున జర్నలిస్టులు తరలారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ముందు జర్నలిస్ట్ కేపీ, టి డబ్ల్యూ జె ఎఫ్ అధ్యక్షులు రాఘవేంద్ర గౌడ్ జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వాహనాలలో ఆందోళన కార్యక్రమానికి పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ తరలి వెళ్లారు. షాద్ నగర్ జర్నలిస్టులు లక్కాకుల రమేష్ కుమార్, ఎలికట్ట శ్రీశైలం, రంగనాథ్, బూర్గుల రమేష్, మల్చలం రమేష్, నరసింహారెడ్డి, రాకేష్, సాయినాథ్ రెడ్డి, జగన్, రవితేజ, రాకేష్, దర్శనం శంకర్, జగన్, ధరంపాల్ సింగ్, షకీల్, రియాజ్, ఆవుల రమేష్, సిటీ కేబుల్ శివ గౌడ్ , సికె న్యూస్ శేఖర్ గౌడ్ , కేశంపేట విలేకరులు నరేందర్ గౌడ్ , భాస్కర్, రాజశేఖర్, నరేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు..

# ఐ.యల్.పి.ఏ మహిళ న్యాయవాదుల సదస్సు జయప్రదం చేయండి.




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా, ఫిబ్రవరి 23:**ఫిబ్రవరి 28 న హైదరాబాద్ లో జరిగే ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఐ.యల్.పి.ఏ తెలంగాణ రాష్ట్ర మహిళా న్యాయవాదుల సదస్సు ను జయప్రదం చేయాలని ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షులు సాధనాల భానుప్రియ, మహమ్మద్ సాదిక్ పాషా, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జనపరెడ్డి గోపి కృష్ణ ప్రసంగిస్తు మహిళా న్యాయవాదులకు వృత్తి నైపుణ్యం లో శిక్షణతో పాటు, న్యాయవాదుల సమస్యలు పరిష్కరం కోసం తీస్కునే చర్యలు గురించి చర్చించి నిర్మాణాత్మక నిర్ణయలు తీస్కోవడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి సితక్క ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని, ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షురాలు సుజాత చౌడంటే తో పాటు జాతీయ, రాష్ట్ర స్థాయి లో ప్రముఖ మహిళా న్యాయవాదులు పాల్గొని ప్రసంగించనున్నారని తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ భాధ్యులు ఆడపాల పార్వతి, మల్లెల ఉషా రాణి, కాకటి నీలివేణి, గుమ్మడి శాంత, లక్ష్మి సరిత, బేబి షామిలి, నకిరేకంటి ఉమా, న్యాయవాదులు రేపాక మనోరమా, కాటబోయిన స్వర్ణలత, నాగ శ్రావంతి, ఇందిరా ప్రియదర్శిని, తదితరులు పాల్గొన్నారు

## పాత పాల్వంచ ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తాం

- 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి
- భర్త కొత్వాల తోపాటు పాత పాల్వంచలో విస్తృతంగా పర్యటించిన విమలాదేవి



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/పాల్వంచ పెన్ సత్తా, ఫిబ్రవరి 23:**పాత పాల్వంచ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు – రోడ్లు, డ్రైన్లు, పారిశుద్యం, మంచి నీటి సరఫరా, స్ట్రీట్ లైటింగ్ వంటి వసతులు కల్పనకు కృషి చేస్తానని 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి అన్నారు. తన భర్త రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు తో కలిసి పాత పాల్వంచలోని రజక బజార్, ముదిరాజ్ బజార్ లలో విమలాదేవి విస్తృతంగా పర్యటించారు.శానిటేషన్, ఎలక్ట్రికల్, వాటర్ సప్లై, మిషన్ భగీరథ సిబ్బందితో పర్యటించి, ప్రజా సమస్యల పరిష్కారానికై సమాలోచనలు జరిపారు.ఈ సందర్భంగా విమలాదేవి మాట్లాడుతూ తానెప్పుడూ ప్రజాసమస్యల పరిష్కారానికై ముందుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కొత్వాల సత్యనారాయణ, వార్డ్ ఆఫీసర్ చందార్కార్, కాంగ్రెస్ నాయకులు వాసుమల్ల సుందర్ రావు, సయ్యద్ యాకుబ్, నిమ్మల మల్లిఖార్జున్, షేక్ ఖాజామియా, షేక్ కరీం, నిమ్మల వెంకట్రావు, పెంకి శ్రీను, ధర్మరాజుల రమేష్, డీవీ, సయ్యద్ వజీర్, ధర్మరాజుల సాయిబాబు, ముదిగొండ శ్రీను, ప్రభాకర్, ముదిగొండ నాగేశ్వరరావు, కుసుమరాజుల సరవయ్య, కుసుమరాజుల కృష్ణ, బూసి శ్రీను, తిరుమలరావు, కిషోర్, యడ్ల ముత్యం, నిమ్మల గోపాలకృష్ణ, నిమ్మల పురుషోత్తమ్, సాంబశివరావు, ఉషా కిరణ్, నిమ్మల మోహన్, బొడ్డు రాములు, బొందిల బాలు, షేక్ యాకుబ్, బండారు తేజ, బొమ్మకంటి సంపత్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## గతంలో ఉన్న విధంగానే యూరియాను సరఫరా చేయాలి.

- ఆన్లైన్ ద్వారా కాక ఆఫ్లైన్లోనే యూరియా ఆదే విధంగా చర్య తీసుకోవాలి.
- టిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు వరికుప్పల మల్లేశం.



**వలిగొండ మండలం పెన్ సత్తా, ఫిబ్రవరి 23:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని సంగం గ్రామంలో మీడియాతో మాట్లాడుతూ యూరియా యాప్ రద్దుచేసి ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలు లేదా రైతు మిత్ర సంఘాల ద్వారా యూరియా నేరుగా రైతులకు అందే విధంగా ప్రభుత్వము చర్యలు తీసుకోవాలని. ప్రభుత్వము ప్రవేశపెట్టిన యూరియా యాప్ వలన రైతులు అనేక ఇబ్బందులకు గురి అవుతున్నారని ఈ యాప్ వలన యూరియా ఎగుమతి చేసే కంపెనీ బిజినెస్ వాళ్లు మాత్రమే లబ్ధి పొందుతున్నారని.

టిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు వరికుప్పల మల్లేశం మీడియా ద్వారా మాట్లాడినారు.

ఈ యాప్ వల్ల రైతులు చాలా అవస్థలు పడుతున్నారని వరి నాట్లు వేసి రెండు నెలలు గడిచిన యూరియా సమయానికి లభించకపోవడం వలన రైతులకు ఇబ్బందులు తప్పడం లేదని రైతుల దగ్గర స్మార్ట్ ఫోన్లు ఇంటర్నెట్ సమస్య ఆధార్ నెంబరుకు ఫోన్ నెంబరు లింకు సమస్య పాస్బుక్ నెంబర్లకు ఆ యాప్ డౌన్లోడ్ చేసే అందులో ఎంట్రీ చేయడం రైతులకు ఇబ్బంది కలిగించే అంశంగా రైతులకు యూరియా అందించే విషయంలో ఆన్లైన్ బ్యాండ్ చేసి ఆఫ్లైన్లోనే అందించాలని మీడియా ద్వారా డిమాండ్ చేసినారు..

## చింతకాని మండలంలో వార్డు మెంబర్లకు ప్రత్యేక శిక్షణ.....



**చింతకాని పెన్ సత్తా, ఫిబ్రవరి 23:**చింతకాని మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న వార్డు మెంబర్ల ప్రత్యేక శిక్షణా తరగతులకు తిమ్మినేనిపాలెం గ్రామంకు చెందిన వార్డు మెంబర్లు హాజరయ్యారు.ఈ శిక్షణలో ఉపసర్పంచ్ కూచిపూడి బుచ్చిబాబుతో పాటు షేక్ మీరాసాహెబ్, గుగ్గిళ్ళ ఆదిలక్ష్మి, దమ్మాలపాటి రమాదేవి, దారెల్లి మమత, కొమ్ము నాగేష్, కొమ్ము నందిని పాల్గొన్నారు.గ్రామాభివృద్ధి కార్యక్రమాల అమలు, పాలనా విధానాలు, ప్రజాసేవలో వార్డు మెంబర్ల పాత్రపై శిక్షణ అందించామని నిర్వాహకులు తెలిపారు.

## ప్రకృతి వ్యవసాయం (నేషనల్ మిషన్ ఆన్ నేచరల్ ఫార్మింగ్ )పై అవగాహనా సదస్సు - ఏ. డి. ఏ స్వర్ణ విజయ చంద్ర



**చింతకాని పెన్ సత్తా, ఫిబ్రవరి 23:**ప్రతినిధి.కేంద్ర ప్రభుత్వం మరియు తెలంగాణ వ్యవసాయ శాఖ వారిచే ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు రేపల్లెవాడ గ్రామం చింతకాని క్లస్టర్ చింతకాని మండలం నందు ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో భాగంగా ఏడిఏ శా. విజయ్ చంద్ర (మధిర) మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయడం వలన భూమి జీవశక్తి పెరుగుతుందని నీటి నిలువలు,మట్టి నాణ్యత మెరుగుపడుతుందని ఆరోగ్యవంతమైన ఆహారం లభిస్తుందని పంటకు మంచి గిరాకీ ఉంటుందని చెప్పారు.

సేంద్రీయ వ్యవసాయానికి జీవ ఎరువులు ,వర్మీ కంపోస్ట్, గోమూత్రం , పుల్లటి మజ్జిగ, బ్రహ్మాస్త్రం, ద్రవ జీవామృతం, దశపర్ణిక అస్త్రం, నీమస్త్రం, అగ్ని అస్త్రం ఆధారిత శీఘ్రకరకాలు వాడాలని చెప్పినారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సోములపల్లి మానస, కృషి వికాస్ కేంద్రం వైరా నుంచి శాస్త్రవేత్త ఫణిశ్రీ గ్రామ సర్పంచ్ మడిపల్లి అంబిక , ఉప సర్పంచ్ బంధం చిన కృష్ణ-రాజుబా తేజ, గ్రామ కార్యదర్శి రామారావు మరియు రైతు సోదరులు బొర్రా శ్రీనివాస రావు, మడిపల్లి శ్రీనివాస రావు,బండి శ్రీనివాస రావు పాల్గొన్నారు.

# పాతపద్ధతిలోనే యూరియా పంపిణీ చేపట్టాలి...




టిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు వరికుప్పల మల్లేశం.

**వలిగొండ మండలం పెన్ సత్తా, ఫిబ్రవరి 23:**యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పరిధిలోని సంఘం గ్రామంలో మీడియాతో మాట్లాడుతూ.

ప్రభుత్వం తీసుకువచ్చిన ఫర్టిలైజర్ యాప్ తో రైతులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని వెంటనే యాప్ ను తొలగించి పాత పద్ధతిలో యధా విధంగా సింగిల్ విండో కేంద్రాలు, మరియు ప్రభుత్వ లైసెన్స్ కలిగిన షాపుల ద్వారా యూరియాను అందించాలి.

రాష్ట్ర ప్రభుత్వం పర్టిలైజర్ యాప్ ద్వారా యూరియాను అందిస్తామని తీసుకున్న నిర్ణయం అనాలోచిత నిర్ణయమని దీంతో అనేకమంది నిరక్షరాస్యులుగా ఉన్న రైతులు యాప్ లను వాడుకొని యూరియాను పొందడానికి అవకాశం లేకుండా ఉందని మరొకవైపు దీన్ని ఆసరాగా చేసుకున్న కొంతమంది మధ్య దళారీలు తమ ఇష్టానుసారంగా అనేకమంది పెద్దపెద్ద భూస్వాములకు తమకు ఎక్కువ ఎరువులను కొనుగోలు చేసే వారికి యూరియాను అందిస్తుండడంతో పేద,చిన్న,సన్న కారు రైతులను తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని వెంటనే ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాన్ని ఉపసంహరించుకొని ప్రభుత్వ సింగిల్ విండో కేంద్రాలు మరియు లైసెన్సు కలిగిన షాపుల ద్వారా యూరియాను అందించాలని డిమాండ్ చేశారులి

మరోవైపు రైతులకు ప్రస్తుతం పొట్టదశకు చేరువైన పొలాలకు యూరియా అవసరం ఉండగా సక్రమంగా యూరియా అందకపోవడంతో తీవ్రమైన ఇబ్బందులు పడుతూ షాపుల వద్ద పడికాపులు కాయాల్సిన పరిస్థితి వచ్చిందని వెంటనే పాత పద్ధతిలో యూరియా పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలని మీడియా ద్వారా డిమాండ్ చేశారు

## ప్రొద్దుటూరు గ్రామంలో ముత్యాలమ్మ ప్రథమ వార్షికోత్సవ.

**చింతకాని పెన్ సత్తా, ఫిబ్రవరి 23:**ప్రతినిధి.

చింతకాని మండలం పొద్దుటూరు గ్రామంలో ముత్యాలమ్మ మరియు బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవ సందర్భంగా దీజ కాలనీవాసులు బట్టి పైన అభిమానంతో, ఎయి పాటలతో ర్యాలీగా రావడం జరిగింది. ఈ కార్యక్రమంలో చింతకాని మండల కాంగ్రెస్ అధికార ప్రతినిధి కూరపాటి కిషోర్ గ్రామ ప్రజలు మహిళలు బోనాలతో భారీగా పాల్గొనడం జరిగినది



# వడదెబ్బ లక్షణాలతో వృద్ధుడు మృతి

- డాక్టర్ రాజశేఖర్ గౌడ్ స్వయంగా మృతదేహం ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు
- వేసవికాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి డాక్టర్ రాజశేఖర్ గౌడ్





**ఖమ్మం. పెన్ సత్తా, ఫిబ్రవరి 23:**ఖమ్మం నగరంలోని రెండవ టౌన్ పోలీస్ పరిధిలో సరిత క్లినిక్ సెంటర్ సమీపంలో సుమారు 60 ఏళ్ల వృద్ధుడు మృతిచెందిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టగా, మృతుడు ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లి గ్రామానికి చెందిన గజ్జల సదానందంగా గుర్తించారు.

ఈ సందర్భంగా డాక్టర్ కేసగాని రాజశేఖర్ గౌడ్ స్వయంగా మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. మృతదేహంపై ఎలాంటి అనుమానం లేకపోవడంతో కుటుంబ సభ్యులు సహజ మరణమని లిఖితపూర్వకంగా తెలియజేయగా, పోలీసులు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనంతరం అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాస్ మృతదేహాన్ని స్వగ్రామమైన మద్దులపల్లికి చేర్చారు.

వడదెబ్బలపై అప్రమత్తంగా ఉండాలి: డాక్టర్ కేసగాని రాజశేఖర్ గౌడ్ సూచన

వృద్ధుడి మృతి నేపథ్యంలో డాక్టర్ కేసగాని రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ, వేసవి కాలంలో తీవ్ర ఉష్ణోగ్రతల కారణంగా వడదెబ్బల ముప్పు అధికమవుతోందని తెలిపారు. శరీరంలో నీరసం, డీహైడ్రేషన్ వల్ల ప్రాణాపాయం సంభవించే అవకాశాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పుష్కలంగా నీరు, ద్రవాలు తీసుకోవడం, ఎండలో ఎక్కువసేపు ఉండకపోవడం వంటి జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.

### ట్రేడ్ డీల్ వాయిదా

### భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై పునరాలోచన

### యూఎస్ సుప్రీంకోర్టు తీర్పుతో అనిశ్చితి



న్యూఢిల్లీ : భారతదేశం-అమెరికా మధ్య తాత్కాలిక వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయడానికి ఫిబ్రవరి 23న వాషింగ్టన్‌లో ప్రారంభం కావాల్సిన చర్చలు వాయిదా పడ్డాయి. ఒప్పందంలో భాగంగా జరగాల్సిన ప్రధాన సంధానకర్తల కీలకమైన సమావేశం సోమవారం ప్రారంభం కావాల్సి ఉంది. ట్రంప్‌నకు వ్యతిరేకంగా అమెరికా సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు, తర్వాత ప్రకటించిన కొత్త పన్ను విధానాలు అనిశ్చితిని పెంచాయి. దీంతో సమావేశం వాయిదా పడింది. దర్పన్ జైన్ నేతృత్వంలోని భారత ప్రతినిధి బృందం, అమెరికా వాణిజ్య ప్రతినిధి జామిసన్ గ్రీర్, అతని బృందం సమావేశం కావాల్సి ఉంది. ఫిబ్రవరి 20న, ట్రంప్ పరిపాలన విధించిన దిగుమతి పన్నులు రాజ్యాంగ విరుద్ధమని అమెరికా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది.దీని తర్వాత, ఫిబ్రవరి 24 నుంచి అన్ని దేశాలపై కొత్తగా 10 శాతం పన్ను విధిస్తామని ట్రంప్ ప్రకటించారు. మరుసటి రోజు దాన్ని 15 శాతానికి పెంచుతున్నట్టు ప్రకటించారు. ఈ కొత్త పరిస్థితులు ఆర్థిక వ్యవస్థను ఎలా ప్రభావితం చేస్తాయో అస్పష్టంగా ఉంది. విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న వస్తువులపై విస్తృత సుంకాలు విధించే అధికారాన్ని అమెరికా సుప్రీంకోర్టు కొట్టివేసినప్పటికీ, భారతదేశంతో వాణిజ్య ఒప్పందంలో మార్పు ఉండదని ట్రంప్ వెల్లడించారు. ఒప్పందం ప్రకారం భారతదేశం నుంచి వచ్చే వస్తువులపై విధించిన 18 శాతం సుంకం కొనసాగుతుందని కూడా ఆయన పునరుద్ఘాటించారు.

### క్రెడిట్ కార్డు యూజర్లకు అలర్ట్

### గడువు కంటే ముందే బిల్లు చెల్లిస్తే లాభమా? నష్టమా?



ఈ రోజుల్లో క్రెడిట్ కార్డులు దాదాపు ప్రతి ఒక్కరు వాడుతున్నారు. కానీ నెలవారీ బిల్లు జనరేట్ అయిన వెంటనే, ఒక పెద్ద ప్రశ్న తలెత్తుతుంది. స్టేట్‌మెంట్ అందిన వెంటనే బిల్లు చెల్లించాలా, లేదా గడువు తేదీ వరకు వేచి ఉండటం మంచిదా?బిల్లు చెల్లింపు సమయం మీ క్రెడిట్ స్కోర్‌ను నేరుగా ప్రభావితం చేస్తుంది కాబట్టి ఈ గందరగోళం తరచుగా వినియోగదారులలో కొనసాగుతుంది. ఈ విషయంలో సరైన దశలను, అది మీ ఆర్థిక జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో చూద్దాం..మీ ఇమెయిల్ లేదా ఫోన్‌లో క్రెడిట్ కార్డ్ స్టేట్‌మెంట్ సందేశం వచ్చినప్పుడు, చాలా మంది గడువు తేదీ వరకు వేచి ఉంటే వారి ఐదీబ్న స్కోరు పడిపోతుందేమో అని ఆందోళన చెందుతారు. వాస్తవం ఏమిటంటే మీరు స్టేట్‌మెంట్ వచ్చిన వెంటనే చెల్లించాలా లేదా గడువు తేదీలోపు మీ బిల్లును చెల్లించడానికి గ్రేస్ పీరియడ్‌ని ఉపయోగించాలా అనేది మీ క్రెడిట్ స్కోరుకు పట్టింపు లేదు. మీ చెల్లింపు బ్యాంకు నిర్దేశించిన గడువులోపు జరిగితే, మీ ఆర్థిక రికార్డు పూర్తిగా సురక్షితంగా ఉంటుంది. మీ ఆర్థిక సౌలభ్యం, నగదు లభ్యతను బట్టి మీరు ఏదైనా ఎంపికను ఎంచుకోవచ్చు.గడువు తేదీ వరకు వేచి ఉండటంలో తప్పు లేదు, కానీ నిర్లక్ష్యం కారణంగా ఈ గడువు దాటితే, మీకు నిజమైన ఇబ్బంది మొదలవుతుంది. బ్యాంకు గడువు తర్వాత చెల్లింపు చేయడం ఆలస్య చెల్లింపుగా పరిగణించబడుతుంది. ఇది మీ మొత్తం క్రెడిట్ చరిత్రను తీవ్రంగా దెబ్బతీసే తీవ్రమైన తప్పు. మీ ఐదీబ్న స్కోరు దెబ్బతిన్న తర్వాత, భవిష్యత్తులో గృహ రుణం, కారు రుణం లేదా కొత్త కార్డు పొందడం చాలా కష్టం అవుతుంది. అందువల్ల, బిల్లులను సకాలంలో చెల్లించడం ఆర్థిక ప్రాధాన్యతగా చేసుకోవడం చాలా ముఖ్యం.క్రెడిట్ కార్డ్ బిల్లింగ్ స్టేట్‌మెంట్‌లలో ఎల్లప్పుడూ రెండు రకాల మొత్తాలు కనిపిస్తాయి. మొత్తం బకాయి, కనీస బకాయి. కనీస మొత్తాన్ని లేదా కనీస బకాయిని చెల్లించడం వల్ల బ్యాంకు జరిమానాలను నివారించవచ్చని, వారి శ్రేయస్సును నిర్ధారిస్తుందని ప్రజలు తరచుగా అనుకుంటారు. అయితే ఆర్థిక దృక్కోణం నుండి, ఇది ఒక పెద్ద ఉచ్చు అని నిరూపించబడింది. మిగిలిన మొత్తం అంటే కనీస మొత్తం, వచ్చే నెలకు ముందుకు తీసుకెళ్లబడుతుంది. బ్యాంకులు దానిపై గణనీయమైన వడ్డీని వసూలు చేస్తాయి. ఈ అలవాటు క్రమంగా గణనీయమైన అప్పుకు దారితీస్తుంది. మీ క్రెడిట్ స్కోర్‌పై దాని ప్రతికూల ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. ఎల్లప్పుడూ పూర్తి బిల్లును చెల్లించండి.

### భారీగా పతనమైన ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ షేర్లు

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ షేర్లు నాటి ట్రేడింగ్ ఆరంభం నుంచి భారీగా పతనం అవుతున్నాయి. ఒకానొక దశలో దాదాపు 20%శాతం పతనమయ్యాయి. ఆ తర్వాత కొద్దిగా కోలుకొన్నా.. భారీ నష్టాల్లోనే కొనసాగుతున్నాయి. తమ బ్యాంక్ చండీగఢ్ బ్రాంచిలో రూ.590 కోట్ల మేరకు కుంభకోణం జరిగినట్లు అనుమానిస్తున్నామని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ప్రకటించింది. గవర్నమెంట్ ఖాతాల నిర్వహణలో ఈ మోసం జరిగినట్లు భావిస్తున్నారు. ఫలితంగా ఇన్వెస్టర్లలో ఆందోళన తీవ్రమైంది. దీంతో నేడు ట్రేడింగ్ మొదలైన వెంటనే ఈ షేర్లు లోయర్ సర్క్యూట్‌ను తాకాయి. ఇక ఉదయం 11.08 సమయంలో 15.28శాతం నష్టంతో రూ.70.75 వద్ద ట్రేడవుతున్నాయి.హరియాణా ప్రభుత్వ విభాగం ఒకటి ఈ బ్యాంకులో తమ ఖాతాను క్లోజ్ చేసి నిధులను బదిలీచేయమని కోరగా ఈ కుంభకోణం వ్యవహారం వెలుగులోకి వచ్చింది. సదరు విభాగ పుస్తకాల్లో నగదు.. బ్యాంక్‌ఖాతాలో మొత్తానికి సరిపోలకపోవడంతో అనుమానాలు మొదలయ్యాయి. దీంతో హరియాణా ప్రభుత్వంలోని పలు శాఖలు తమ ఖాతాలను సరిచూసుకోవడం మొదలుపెట్టాయి. అయితే చండీగఢ్ శాఖలోని ఖాతాల్లోనే ఈ సమస్య ఉన్నట్లు తెలుస్తోంది.

### ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో రూ.590 కోట్ల మోసం

ముంబయి: హరియాణా ప్రభుత్వం నిర్వహిస్తున్న ఖాతాల్లో తమ ఉద్యోగులు, ఇతరులు చేసిన రూ.590 కోట్ల మోసాన్ని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ఆదివారం వెల్లడించింది. బ్యాంకింగ్ నియంత్రణ సంస్థ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ఈ విషయాన్ని వెల్లడించడంతో పాటు పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారమిచ్చింది. చండీగఢ్‌లోని ఒక శాఖలో కొంతమంది ఉద్యోగులు హరియాణా రాష్ట్ర ప్రభుత్వ ఖాతాల్లో ప్రాథమికంగా అనధికారిక, మోసపూరిత కార్యకలాపాలు నిర్వహించినట్లు గుర్తించినట్లు ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ పేర్కొంది. ఇతర వ్యక్తులు/సంస్థలు/కౌంటర్‌పార్టీలు కూడా ఇందులో భాగమయ్యే అవకాశం ఉందని తెలిపింది. ప్రస్తుతం మోసం విలువను రూ.590 కోట్లుగా అంచనా వేసింది.తదుపరి సమాచారం, క్లెయిమ్‌ల ధ్రువీకరణ, రికవరీల ఆధారంగా తుది మొత్తాన్ని నిర్ణయిస్తామని వివరించింది. హరియాణా ప్రభుత్వ విభాగం ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌తో బ్యాంకింగ్ లావాదేవీలు నిర్వహిస్తోందని.. రుణదాతకు వెల్లడించని తేదీన క్లోజర్, బ్యాలెన్స్ బదిలీ కోసం మరొక బ్యాంకుకు అభ్యర్థన అందిందని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ తెలిపింది. ఈ ప్రక్రియలో ఖాతాలోని బ్యాలెన్స్‌తో పోలిస్తే, పేర్కొన్న మొత్తంలో వ్యత్యాసం కనిపించింది.

# మోడీమార్క్..ధరాభారం

**జీఎస్టీ శ్లాబుల కుదింపు ఉత్తిదే**

**ముడిసరుకుల ధరలకు రెక్కలు**

**రేట్లు పెంచకతప్పదంటున్న ఎఫ్ఎమ్‌సీజీ సంస్థలు**

**శ్లాబుల కుదింపు తర్వాత ఇప్పటికే 35 శాతం పెరిగిన ధరలు**

**సామాన్యులపై ఆర్థిక పిడుగు**

**కుడిచేత్తో ఇచ్చి... ఎడమచేత్తో లాక్కుంటున్న కేంద్రం**

**ఎస్ఎస్ఆర్ శాస్త్రి**



కుడిచేత్తో ఇచ్చి ఎడమచేత్తో లాక్కోవడం ప్రధాని నరేంద్రమోడీకి వెన్నతోపెట్టిన విద్య! వస్తు సేవల పన్ను (జీఎస్టీ) శ్లాబుల్ని కుదించి, ప్రజలకు అవసరమైన వస్తువుల ధరలు గణనీయంగా తగ్గించేశామని ప్రచారం చేసుకున్నారు. ఈ మేరకు అనేక ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్ (ఎఫ్ఎమ్‌సీజీ) సంస్థలు ప్రధాని నరేంద్రమోడీ పెద్దసైజు ఫోటోలు పత్రికల్లో ప్రచురించి, తమ ఉత్పత్తుల రేట్లు తగ్గిస్తున్నామని అర్భాటంగా ప్రచారం చేసిన విషయం తెలిసిందే. 2025 సెప్టెంబర్ 22 నుంచి సవరించిన జీఎస్టీ శ్లాబులు అమల్లోకి వచ్చాయి. నవంబర్ వరకు కొన్ని వస్తువుల ధరలు తగ్గాయి. వాటిని చూపే ఎఫ్ఎమ్‌సీజీలు ప్రధాని మోడీకి ప్రచారాన్ని కల్పించాయి. కానీ డిసెంబర్ నుంచి సీన్ మారింది. క్రమంగా ఒక్కో వస్తువు ధర పెరగడం ప్రారంభమైంది. జీఎస్టీ శ్లాబుల్ని కుదించిన కేంద్ర ప్రభుత్వం డాలర్‌తో రూపాయి మారకాన్ని బలపర్చలేకపోయింది. ఫలితంగా రూపాయి విలువ రోజురోజుకూ పతనం అయ్యి, ప్రస్తుతం ఒక డాలర్‌తో రూపాయి మారకం రూ.93కి పడిపోయింది.ఫలితంగా దిగుమతి వస్తువులతో పాటు, స్వదేశంలో ముడిసరుకుల ధరలు పెరిగాయి. దీనితో ఎఫ్ఎమ్‌సీజీలు తమ ఉత్పత్తుల ధరల్ని ఇప్పటికే గణనీయంగా పెంచేశాయి. మరోసారి 5 నుంచి 10 శాతం వరకు పెంచుతామని ప్రకటించాయి. మరి ప్రధాని మోడీ చేసిన జీఎస్టీ శ్లాబుల కుదింపు ప్రయోజనాలు సామాన్యులకు చేరినట్టా... లేదా...అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ప్రధాని మోడీ జీఎస్టీ శ్లాబుల్ని కుదించి, రూపాయి పతనాన్ని నిలువరించలేకపోవడంతో మళ్లీ సామాన్యులపై ధరల భారం తప్పట్లేదు. విచిత్రంగా గత జీఎస్టీ శ్లాబులకంటే, ఇప్పుడు ధరలు ఎక్కువగా పెరుగుతున్నాయి. జీఎస్టీ శ్లాబుల కుదింపునకు ముందు, ప్రస్తుత మార్కెట్ ధరలు, ఎఫ్ఎమ్‌సీజీలు పెంచాలని భావిస్తున్న ధరలతో పోలిస్తే వినియోగదారులపై అతి భారీగా ఆర్థికభారం పడబోతోంది.

ఎఫ్ఎమ్‌సీజీల వాదననిత్యావసర వస్తువుల ధరల పెంపు తప్పదని ఎఫ్ఎమ్‌సీజీ సంస్థలు స్పష్టంచేస్తున్నాయి. ఆ మేరకు ఇప్పటికే దేశవ్యాప్తంగా నిత్యావసర వినియోగ వస్తువుల (ఎఫ్ఎమ్‌సీజీ) ధరల పెంపుపై ప్రధాన కంపెనీలు, పరిశ్రమలు సంకేతాలు ఇచ్చాయి. కనీసం 5 నుంచి 10 శాతం వస్తువుల ధరల్ని పెంచుతామని చెప్తున్నాయి. ముడి సరుకు ధరల పెరుగుదల, రవాణా వ్యయాల భారంతో పాటు రూపాయి మారకం విలువలో మార్పులు వంటి కారణాలతో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని చెప్తున్నాయి.ఇవీ కారణాలుఎఫ్ఎమ్‌సీజీ సంస్థలు ధరలు పెంచేందుకు పలు కారణాలను చూపుతున్నాయి. ప్రధానంగా పామ్‌ఆయిల్, ప్యాకేజింగ్ ప్లాస్టిక్, పేపర్, గోధుమలు, చక్కెర వంటి ముడి సరుకుల ధరలు పెరిగాయి. ముఖ్యంగా ఎడిబుల్ ఆయిల్స్ (వంటనూనెలు), పాలు, ధాన్యాల ధరల మార్పు కంపెనీలపై ఒత్తిడిని పెంచిందని చెప్తున్నాయి. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ సహా అన్నింటి ధరలు పెరిగాయి. ఫలితంగా రవాణా చార్జీలు పెరిగాయి. గ్రామీణ మార్కెట్లకు సరకు సరఫరా ఖర్చు పెరిగింది. ప్లాస్టిక్, కార్టన్, అల్యూమినియం ఫాయిల్ ధరలు పెరగడంతో ప్యాకేజింగ్ వ్యయం 8 నుంచి 12 శాతం వరకు పెరిగిందని గణాంకాలు చెప్తున్నాయి.ప్రధానంగా దిగుమతి ముడి సరుకులపై ఆధారపడే కంపెనీలకు డాలర్ పెరగడం వల్ల అదనపు ఖర్చు పెరిగింది. కేంద్రంలోని మోడీ ప్రభుత్వ ఆర్థిక విధానాల వల్ల దేశంలోకి దిగుమతులు గణనీయంగా పెరిగాయి. ఆ స్థాయిలో ఎగుమతులు లేకపోవడం గమనార్హం. సహజంగా దిగుమతులు రూపాయిల్లో ఉంటే, చెల్లింపులు డాలర్లలో చేయాలి. ప్రస్తుతం డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ దాదాపు రూ.93 గా ఉంది. అలాగే కార్మికుల వేతనాలు, గిడ్డం గి నిర్వహణ వ్యయాలు కూడా పెరిగాయని ఎమ్ఎమ్‌సీజీలు చెప్తున్నాయి. దీన్ని నియంత్రించకుంటే సామాన్యుల బడ్జెట్ చితికిపోవడం ఖాయంగా కనిపిస్తున్నది.

పెరిగేది ఇలా..పరిశ్రమ అంచనాల ప్రకారం సబ్బులు, షాంపూల ధరలు 5 నుంచి 8 శాతం పెరుగుతాయి. ప్యాకేజ్డ్ ఫుడ్, బిస్కెట్లు 6 నుంచి 10 శాతం, వంటనూనెలు, మసాలా ఉత్పత్తులు 8 నుంచి 15 శాతం, డిటర్జెంట్లు, క్లీనింగ్ ఉత్పత్తులు 4 నుంచి 7 శాతం చొప్పున పెరుగుతాయని మార్కెట్ విశ్లేషకులు చెప్తున్నారు. జీఎస్టీ శ్లాబుల కుదింపునకు ముందు, ప్రస్తుత ధరలు, పెరిగే ధరలతో పోలిస్తే అనేక వస్తువుల ధరలు 40 నుంచి 50 శాతం వరకు పెరిగాయి.


# సాంకేతిక ప్రగతి వెనుక పొంచి ఉన్న నీటి గండం!

**డేటా సెంటర్ల దాహార్తి**

**ఏడాదిలో గూగుల్ ఆవిరి చేసిన మంచినీరు 6.1 మిలియన్ గ్యాలన్లు**

**కరువు ప్రాంతాల్లో పెనుముప్పు**

**పర్యావరణం పైనా తీవ్ర ప్రభావం**



న్యూఢిల్లీ : కృత్రిమ మేధ...అదే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్. ఇప్పుడు ఎవరి నోట విన్నా వినిపిస్తున్న పేరు. ఇప్పటికే అనేక ఐటీ కంపెనీలు ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటున్నాయి. దీనిపై ప్రపంచవ్యాప్తంగా అనేక సదస్సులు, సమావేశాలు జరుగుతున్నాయి. మూడు రోజుల క్రితం దేశ రాజధాని ఢిల్లీలోనూ దీనిపై అంతర్జాతీయ సదస్సును నిర్వహించారు. దీనికి ప్రధాని నరేంద్రమోడీ సహా తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో పాటు పలు రాష్ట్రాల ప్రతినిధులు హాజరయ్యారు.

పలు దేశాలకు చెందిన ఏఐ సంస్థల అధినేతలు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థల మధ్య వేలకోట్ల రూపాయలు విలువైన ఒప్పందాలు జరిగాయి. ఇదంతా నాణేనికి ఓ వైపు.మరోవైపు ఏఐ చేస్తున్న పర్యావరణ విధ్యంసం ప్రపంచానికి ఆందోళన కలిగిస్తుంది. భారీగా ఏర్పాటు చేసే ఏఐ డేటా సర్వర్లు శీతల వాతావరణంలోనే పనిచేస్తాయి. వాటిని చల్లబర్చేందుకు బిలియన్ల కొద్దీ గ్యాలన్ల తాజా నీటిని వినియోగిస్తారు. దీనివల్ల మానవాళికి తాగునీటి సమస్య తీవ్రమయ్యే ప్రమాదం పొంచి ఉందని ఐటీరంగ నిపుణులు చెప్తున్నారు. కరువు కాటకాలతో విలవిల్లాడే ప్రాంతాల్లో ఏఐ సర్వర్లను ఏర్పాటు చేస్తే, అక్కడి ప్రజలకు మరిన్ని నీటి కష్టాలు తప్పవని హెచ్చరిస్తున్నారు.చల్లదనం ఎందుకు?డేటా సెంటర్లకు చల్లదనం అవస రాన్ని సాంకేతిక నిపుణులు చక్కగా విశ్లేషించారు. కంప్యూటర్లు తీవ్రమైన వేడిని ఉత్పత్తి చేస్తాయి. మీరు ఏఐని ఒక కవిత రాయమనో లేదా ఓ చిత్రాన్ని గీయమనో అడిగితే ఒకేసారి వేలాది ప్రాసెసర్లు పనిచేయాల్సి ఉంటుంది. ఫలితంగా తీవ్రమైన థర్మల్ ఎనర్జీ వెలువడుతుంది. ఆ వేడికి కోట్లాది రూపాయలు ఖరీదు చేసే యంత్రాలు కరిగిపోయే ప్రమాదం ఉంది. దానిని నివారించేందుకే డేటా కేంద్రాలు కూలింగ్ టవర్లను ఉపయోగిస్తాయి. ఈ వ్యవస్థలు ఆవిరైపోయే చల్లదనం ద్వారా పనిచేస్తాయి. వేడిగా ఉన్న ఉపరితలాలపై నీటిని వెదజల్లడం ద్వారా వాతావరణాన్ని చల్లబరుస్తారు. ఈ నీటిలో 80 శాతం ఆవిరి రూపంలో వాతావరణంలో కలిసి పోతుంది. ఆవిరిని రీసైక్లింగ్ చేయలేము కాబట్టి అది స్థానిక నీటి చక్రం నుంచి అదృశ్యమైపోతుంది. అంటే దీనర్థం ఏమిటి? ప్రతి రోజూ మిలియన్ గ్యాలర్ల నీరు ఆవిరైపోతుంది కానీ అందులో ఒక్క చుక్క కూడా తిరిగి ఉపయోగపడదు.రీసైక్లింగ్ నీరు వాడితే...టెక్ కంపెనీలు రీసైక్లింగ్ నీరును లేదా కాలుష్య కారక వ్యర్థ జలాలను ఉపయోగించుకోవచ్చు కదా అనే ప్రశ్న సహజం. కానీ నీటిలో సహజంగానే కాల్షియం, మెగ్నీషియం వంటి ఖనిజాలు ఉంటాయి. శీతలీకరణ పక్రియ ద్వారా నీరు ఆవిరై పోతుంది. అంటే ఈ ఖనిజాలు మరింతగా కేంద్రీకృతమవుతాయన్న మాట. చివరికి అవి లైమ్‌స్కేల్ (గట్టి సున్నపు నిక్షేపం. ఇది తరచుగా వేడి నీటి కోసం ఉపయోగించే బాయిలర్లు, పైపుల లోపల పేరుకుపోతుంది) అనే గట్టి పెంకును ఏర్పరుస్తాయి. ఇది చాలా హానికరమైనది.మందపాటి దుప్పటి మాదిరిగా పనిచేస్తూ వేడిని బంధిస్తుంది. పంపులలో ప్రవాహాన్ని అడ్డుకుంటుంది. రీసైకిల్ చేసిన నీటిలోని ఖనిజాలు ఏఐ డేటా సెంటర్లలోని ఉష్ణ వినిమయాలను నష్టపరుస్తుంది. రీసైకిల్ చేసిన నీటిలో సహజంగానే ఖనిజాలు అధికంగా ఉంటాయి. కాబట్టి అది మొదటి నుంచే తన ప్రభావాన్ని చూపుతుంది. ఆ నీటిని సురక్షితంగా ఉపయోగించాలంటే కంపెనీలు పెద్ద ఎత్తున ఆన్-సైట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను నిర్మించాల్సి ఉంటుంది. ప్రస్తుతం అమెరికాలో ఒక శాతం కంటే తక్కువ నీరే రీసైక్లింగ్ అవుతోంది. రీసైక్లింగ్ అయిన నీటిని పారిశ్రామిక ప్రాంతాలకు అందించే మౌలిక సదుపాయాలు కూడా అనేక నగరాలలో లేవు. కాబట్టి రీసైక్లింగ్ నీటితో పోలిస్తే డేటా సెంటర్లకు మంచి నీరే చౌకగా లభిస్తోంది.చల్లదనం ఉంటేనే పనిచేస్తాయిడిజిటల్ ప్రపంచం ఎలాంటి ఆటంకాలు లేకుండా ఎందుకు సజావుగా నడుస్తోందో ఎప్పుడైనా ఆలోచించారా? భారీ గిడ్డంగులలో నిరంతరం పని చేసుకుంటూపోతున్న సర్వర్లే దీనికి కారణం. అయితే అలా పనిచేస్తూ పోవాలంటే చల్లదనం అవసరం. గూగుల్ కంపెనీకి చెందిన డేటా సెంటర్లు ఒక సంవత్సర కాలంలో 6.1 బిలియన్ గ్యాలన్ల తాజా నీటిని వినియోగించుకున్నాయని ఆ సంస్థకు చెందిన పర్యావరణ నివేదిక (2024) తెలిపింది. నీటి వినియోగం యదార్థమేనని ఆ టెక్ దిగ్గజ సంస్థ అంగీకరించింది. 2014తో పోల్చినప్పుడు గూగుల్ డేటా సెంటర్లు 2023లో వాడుకున్న నీటి వినియోగం 17 శాతం పెరిగింది. అదే సమయంలో విద్యుత్ వినియోగం కూడా పెరిగిందని ఆ నివేదిక తెలియజేసింది.

సముద్రంలో నీటి చుక్క కాదుఈ నీటి వినియోగాన్ని కేవలం సముద్రంలో ఓ నీటి చుక్కగా చూడకూడదు. అమెరికా నైరుతి ప్రాంతంలో ఉన్న 41 గోల్ఫ్ కోర్సులకు నీటి పారుదల సౌకర్యం కల్పించేందుకు ఏటా ఎంత నీరు అవసరం అవుతుందో ఆ పరిమాణంలో నీటిని గూగుల్ డేటా సెంటర్లు వాడుకుంటున్నాయి. కృత్రిమ మేధ దిశగా సాంకేతిక పరిజ్ఞానం పరివర్తన చెందుతున్న తరుణంలో సర్వర్ల నీటి 'దాహాన్ని' తీర్చడం నానాటికీ కష్టమవుతోంది.పర్యావరణంపై ప్రభావంకృత్రిమ మేధ సాంకేతిక పరిజ్ఞానం కోసం డేటా సెంటర్లు మంచి నీటిని అధిక పరిమాణంలో వినియోగించడం పర్యావరణవేత్తలను ఆందోళనకు గురిచేస్తోంది. మోర్గాన్ స్టాన్లే నివేదిక ప్రకారం ఏఐ డేటా సెంటర్ల నీటి వినియోగం 2028 నాటికి 11 రెట్లు పెరుగుతుంది. ఇక్కడ గమనించాల్సిన ముఖ్య విషయమేమంటే నీటి కొరతతో ఇబ్బంది పడుతున్న ప్రాంతాల్లోనే డేటా సెంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఏఐ సర్వర్లను చల్లగా ఉంచడం కోసం మంచి నీటికి పెరుగుతున్న డిమాండ్ కరువు పీడిత ప్రాంతాలలో నీటి సరఫరాకు ముప్పును కలిగిస్తోంది. కృత్రిమ మేధ మన జీవితాలతో పెనవేసుకుపోతున్న కొద్దీ మనకు అత్యంత విలువైన సహజ వనరులపై ఒత్తిడి మరింత తీవ్రమవుతోంది.

RNI:APTEL/2023/87729
పెన్ సత్తా
PEN SATTA Telugu Daily

# ఎడిటోరియల్

## గ్రెగేరియన్ కేలండర్ మొదలైన రోజు

ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అనుసరిస్తున్న గ్రెగేరియన్ కేలండర్ ఎప్పుడు రూప కల్పన చేయబడి అమలుకు నోచుకున్నదో తెలుసా? క్రీస్తు శకం 1582 ఫిబ్రవరి 24వ తేదీన. నేపుల్సుకు చెందిన అలోయిసియస్ లిలియస్ అనే వైద్యుడు జూలియన్ కాలెండరుకు చేసిన సవరణల ఫలితమే నూతన గ్రెగేరియన్ కేలండర్. దీన్ని పోప్ గ్రెగొరీ 13 తయారు చేయించి 1582 ఫిబ్రవరి 24 న అమలు పరచాడు. ఆయన పేరు మీదుగా దీనికి గ్రెగోరియన్ కాలెండరు అనే పేరు వచ్చింది. దీనికి సంబంధించిన పూర్వాపరాలు తెలుసుకుందాం.

ప్రపంచంలో వివిధ ప్రాంతాలలో సంవత్సరాది పండగను వివిధ దినాలలో జరుపుకుంటారు. ఇలా జరుపుకోవడానికి కారణం సంవత్సర పరిగణన వేరువేరు మాసాలలో జరగడమే. ప్రపంచంలో అత్యధికులు ఆచరించేది ప్రస్తుత గ్రెగేరియన్ క్యాలెండర్ క్రీ.శ.1582లో రూపొందించినది. జనవరి 1వ తేదీన నూతన సంవత్సర తొలి రోజును పండగలా జరుపుకోవడం నాటికి కొత్త విషయం.క్రీ.పూ.2000లో వసంత సమరాత్రి సమయాన మార్చి మధ్య కాలంలో మెసపొటేమియాలో నూతన సంవత్సర ఉత్సవాలు తొలి నాళ్ళలో జరుపుకునే వారు. అలాగే వివిధ ప్రాంతాలలో రుతు సంబంధంగా ప్రాచీనులు విభిన్న రోజులలో సంవత్సరాదిని పాటించేవారు. ఈజిప్టియన్లు, ఫొయెనిషియన్లు, పర్షియన్లు సమరాత్రి ప్రారంభం, గ్రీకులు శీతకాల ఆయనాంత సమయాన జరుపుకునే వారు. పూర్వపు రోమన్లు మార్చి నెల 1వ తేదీని కొత్త సంవత్సర ఆరంభ దినంగా నియమం పెట్టుకున్నారు.ఆనాటి క్యాలెండర్ మార్చితో ప్రారంభమై 10నెలలతో కూడి ఉండేది. లాటిన్ లో "సెప్టెం" అనగా ఏడు అని, "అక్టో" అనగా ఎనిమిది అని "నొవం" అనగా తొమ్మిది అని, "దశం" అనగా పది అని అర్థం. క్రీ.పూ.153లో ప్రప్రథమంగా జనవరి 1న నూతన సంవత్సర తొలి రోజుగా పరిగణించారు. వాస్తవానికి క్రీ.పూ.700 వరకు జనవరి మాసం ఉనికే లేదు. రోమ్ రెండవ రాజైన నుర్మా పొంటిలియస్ జనవరి, ఫిబ్రవరి మాసాలను జత చేయడం జరిగింది. రోమ్ సామ్రాజ్యంలో పౌర యుద్ధం చోటు చేసుకుని, గణతంత్ర రాజ్యంలో ఇరువురు ఉన్నతాధికారులైన అమాత్యులు కొత్తగా ఎన్నికైన సందర్భాన వారి పదవీ కాలాన్ని ఏడాదిగా నిర్ణయించారు. ఆ సందర్భంగా మార్చి నుండి జన వరికి తొలి రోజును మార్చినా, అది ఖచ్చితంగా పాటించ బడలేదు. అప్పటికీ మార్చి 1ననే కొత్త సంవత్సర వేడుకలు జరిగేవి.క్రీ.పూ.46లో జూలియస్ సీజర్ ప్రాచీన చాంద్రమా నాధారిత రోమన్ క్యాలెండర్ ను మెరుగు పరిచి, సౌర మాన ఆధారిత నూతన క్యాలెండర్ ను పరిచయం చేయగా, సదరు క్యాలెండర్ జనవరి 1ననే కొత్త సంవత్సర ప్రారంభ దినంగా పరిగణింప చేయగా, అది క్రమేణ నిలకడగా పాటించ బడింది. మధ్య యుగాన ఐరోపాలో నూతర వత్సర సంబరాలు అన్యమత సంబంధమైనవిగా భావించ బడగా, క్రీ.శ.567లో జనవరి 1వ తేదీన నూతన సంవత్సర ప్రారంభ దినాన్ని పాలకులచే రద్దు చేయబడింది. మధ్యయుగ క్రైస్తవులు ఐరోపాలో చాలా వరకు కొత్త సంవత్సర దిన వేడుకలను జీసస్ జన్మదిన సందర్భంగా డిసెంబర్ 25న, మార్చి 1న, మార్చి 25న, ఈస్టర్ సందర్భంగా పాటించేవారు.నేపుల్సుకు చెందిన అలోయిసియస్ లిలియస్ అనే వైద్యునిచే 1582వ సంవత్సరం ఫిబ్రవరి 24వ తేదీన సంస్కరింపబడి, జూలియన్ కాలెండరుకు పునరుద్దరింప బడిన గ్రెగేరియన్ క్యాలెండర్ జనవరి 1వ తేదీని నూతన సంవత్సర తొలి రోజుగా ప్రకటింపగా, వెనువెంటనే చాలా వరకుక్యాథలిక్ దేశాలు స్వీకరించాయి. తర్వాత క్రమంగా ప్రొటెస్టెంట్ దేశాలు కూడా స్వీకరించాయి. అయితే 1752 వరకు బ్రిటిషర్లు స్వీకరించలేదు. అప్పటికీ బ్రిటిష్ సామ్రాజ్యం, వారి అమెరికన్ కాలనీలు మార్చి మాసంలోనే నూతన సంవత్స వేడుకలు జరుపుకునే వారు. 1752 తర్వాత బ్రిటిష్ రాచరిక పాలకులు తమ ఆధీనంలోని దేశాలన్నింటిలో జనవరి 1వ తేదీని నూతన సంవత్సర తొలి రోజుగా ఆచరించే చర్యలు గైకొన్నారు. మొట్టమొదటి సారిగా గ్రెగేరియన్ క్యాలెండర్ కు, జూలియస్ సీజర్ క్యాలెండర్ కు గల రోజుల వ్యత్యాసాన్ని సవరించి, 1582 అక్టోబర్ మాసంలో 5 నుండి 14వ తేదీలను ఇటలీ, పోర్చుగల్, స్పెయిన్, పోలండ్ దేశాలలో లేకుండా చేసి, 4తర్వాత 15ను మార్చడం జరిగింది. 1752 సెప్టెంబరులో 3నుండి 13 తేదీలు తొలగించి, 11రోజులను లేకుండా సరి చేశారు..

జనవరి 7 ఈజిప్టియన్లు, 11న ఓల్డ్ స్కాటిష్, 14న ఈస్టర్న్ ఆర్థడాక్స్, 21న కొరియన్లు, మార్చి 1న రోమన్లు, ఏప్రిల్ 13,14ను (బైసాకి) నానక్ సాహి క్యాలెండర్ ఆధారంగా సిక్కులు, ఉగాదిని తెలుగువారు, ఏప్రిల్ 14ను అగ్నేయాసియా దేశాలు, ఏప్రిల్ మొదటి వారంలో పౌర్ణమిని బౌద్ధులు, మొహర్రం నెల మొదటి రోజు ఇస్లాం, జూన్ 21ని ఏనిషియెంట్ గ్రీక్, జూలై 8ని ఆర్మేనియన్, ఆగస్టు 8ని మళయాళీలు, 23ను జొరాస్ట్రియన్, సెప్టెంబర్ 1ని రష్యన్ ఆర్తడాక్స్ క్రిస్టియన్, 11ను ఇథియోపియన్, అక్టోబర్ 3ను మొరాకో, నవంబర్ లో దీపావళిని జైనులు, డిసెంబర్ లో సిక్కిం న్యూ ఇయర్ డేగా పాటించడం అనవాయితీ.


# అవిసె గింజలతో చెడు కొలెస్ట్రాల్‌కు చెక్..



ఆరోగ్యంగా ఉండాలని ఎన్నో రకాల విదేశీ ఆహార పదార్థాల కోసం వెతుకుతూ ఉంటాం. కానీ మన వంటగదిలోనే పోషకాల గని దాగి ఉందని చాలామందికి తెలియదు. అవే 'అవిసె గింజలు'. చూడటానికి చిన్నవిగా కనిపించినా, ఇవి చేసే మేలు మాత్రం అపారం. ముఖ్యంగా గుండె ఆరోగ్యాన్ని కాపాడటంలోనూ, పెరుగుతున్న బరువును అదుపు చేయడంలోనూ ఇవి మ్యాజిక్ లా పనిచేస్తాయి. నేటి కాలంలో ఒత్తిడి, సరిగ్గా లేని ఆహారపు అలవాట్ల వల్ల వచ్చే కొలెస్ట్రాల్, రక్తపోటు వంటి సమస్యలకు అవిసె గింజలు ఒక సహజ సిద్ధమైన మందుగా ఉపయోగపడతాయి. అవిసె గింజల్లో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. ఇందులో ఉండే ఆల్ఫా లైనోలిక్ యాసిడ్ (ఒఒం) గుండె కండరాలను బలపరచడమే కాకుండా, రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. దీనివల్ల గుండెపోటు వచ్చే ప్రమాదం గణనీయంగా తగ్గుతుంది. అంతేకాకుండా, వీటిలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉండటం వల్ల శరీరంలోని వాపులను తగ్గిస్తాయి. తక్కువ క్యాలరీలు ఉండే ఈ గింజలను ప్రతిరోజూ ఒక చెంచా పొడి రూపంలో లేదా స్మూతీలలో కలుపుకొని తీసుకోవడం వల్ల గుండె పదిలంగా ఉంటుంది.

మన శరీరంలో పేరుకుపోయే చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో అవిసె గింజలు అద్భుతంగా పనిచేస్తాయని పలు పరిశోధనలు వెల్లడించాయి. ఇందులో ఉండే కరగని ఫైబర్ (పీచు పదార్థం) జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. దీర్ఘకాలిక మలబద్ధక సమస్యతో బాధపడేవారు ఒక గ్లాసు నీటిలో నానబెట్టిన అవిసె గింజలను తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ఇది మెటబాలిజం రేటును పెంచి, శరీరాన్ని చురుకుగా ఉంచుతుంది. బీపీ లేదా హైపర్ టెన్షన్ తో సతమతమయ్యే వారు ప్రతిరోజూ అవిసె గింజలను తీసుకోవడం శ్రేయస్కరం. ఇది సిస్టోలిక్, డిస్టోలిక్ బ్లడ్ ప్రెషర్ రెండింటినీ అదుపులో ఉంచుతుంది. ఉదయం బ్రేక్ ఫాస్ట్ లో ఒక టేబుల్ స్పూన్ లేదా రాత్రి డిన్నర్ సమయంలో వీటిని ఆహారంతో పాటు తీసుకోవచ్చు. క్రమం తప్పకుండా వాడటం వల్ల రక్తపోటు సహజంగానే అదుపులోకి వస్తుంది. వెయిట్ లాస్ జర్నీలో ఉన్నవారికి అవిసె గింజలు ఒక ఉత్తమ ఆహారం. ఇందులో ఫైబర్ అధికంగా ఉండటం వల్ల వీటిని తిన్న తర్వాత కడుపు నిండుగా ఉన్నట్లు అనిపిస్తుంది. దీనివల్ల పదే పదే ఆకలి వేయదు, తద్వారా అతిగా తినడం తగ్గుతుంది. బరువు నిర్వహణలో ఉన్నవారు సలాడ్లు, చపాతీలు లేదా యోగార్ట్ లో వీటి పొడిని వేసుకొని తీసుకోవచ్చు.షుగర్ వ్యాధితో బాధపడుతున్న వారికి, ముఖ్యంగా టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి అవిసె గింజలు ఎంతో మేలు చేస్తాయి. వీటిని పొడి రూపంలో తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు హఠాత్తుగా పెరగకుండా ఉంటాయి. యోగార్ట్ లేదా పన్నీర్ వంటి ప్రోటీన్ ఆహారంతో కలిపి వీటిని తీసుకోవడం వల్ల ఇన్సులిన్ సున్నితత్వం పెరుగుతుంది. ఇందులో ఉండే లిగనన్స్ అనే యాంటీ ఆక్సిడెంట్లు శరీర రోగనిరోధక శక్తిని కూడా పెంచుతాయి. అవిసె గింజలు మన ఆరోగ్యానికి ప్రకృతి ప్రసాదించిన వరం. అయితే వీటిని నేరుగా తినడం కంటే వేయించి లేదా పొడి చేసి తీసుకోవడం వల్ల పోషకాలు శరీరానికి మెరుగ్గా అందుతాయి. చపాతీ పిండిలో లేదా కూరల్లో కూడా వీటి పొడిని వాడుకోవచ్చు.


# ఈ మ్యాజిక్ డ్రింక్ తాగితే 30 రోజుల్లో పొట్ట కొవ్వుకు చెక్



బరువు తగ్గాలి అంటే గంటల తరబడి జిమ్‌లో కష్టపడాలి లేదా కడుపు మాడ్చుకుని కఠినమైన డైట్ పాటించాలి అని చాలామంది భయపడుతుంటారు. అయితే కేవలం వ్యాయామం, తక్కువ ఆహారం తీసుకోవడం వల్ల మాత్రమే బరువు తగ్గడం సాధ్యం కాదని నిపుణులు చెబుతున్నారు. మన శరీరంలో పేరుకుపోయిన వ్యర్థాలను, విషతుల్యాలను ఎప్పటికప్పుడు బయటకు పంపడం కూడా అంతే ముఖ్యం. శరీరాన్ని లోపల నుంచి శుభ్రం చేయకపోతే మీరు ఎంత కష్టపడినా వెయిట్ లాస్ అనేది చాలా నెమ్మదిగా జరుగుతుంది. ఇక్కడే మనకు 'డిటాక్స్ డ్రింక్' ఎంతో సహాయపడుతుంది. బరువు తగ్గడంలో మెటబాలిజం (జీవక్రియ) పాత్ర చాలా కీలకం. ఈ డిటాక్స్ డ్రింక్ కోసం ఒక గ్లాస్ బాటిల్‌లో రెండు స్పూన్ల స్వచ్ఛమైన తేనె, అర నిమ్మకాయ రసం తీసుకోవాలి. తేనె మన శరీరానికి తక్షణ శక్తిని ఇస్తే, నిమ్మకాయలోని సి విటమిన్ కొవ్వును కరిగించడంలో అద్భుతంగా పనిచేస్తుంది. ఈ రెండింటి కలయిక వల్ల శరీరంలోని మెటబాలిజం రేటు పెరుగుతుంది. అంటే మీరు విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో కూడా క్యాలరీలు ఖర్చయ్యేలా ఈ పానీయం ప్రోత్సహిస్తుంది. ఈ డ్రింక్‌లో మరో ముఖ్యమైన పదార్థం 'చియా విత్తనాలు'. ముందుగా నానబెట్టిన ఒక స్పూన్ చియా విత్తనాలను ఈ పానీయంలో కలుపుకోవాలి. వీటిలో ఫైబర్ (పీచు పదార్థం) పుష్కలంగా ఉండటం వల్ల వీటిని తీసుకున్న తర్వాత పొట్ట నిండిన భావన కలుగుతుంది. దీనివల్ల అనవసరమైన సమయంలో ఆకలి వేయదు, తద్వారా మీరు జంక్ ఫుడ్ లేదా అధిక క్యాలరీలు ఉన్న ఆహారం తీసుకోకుండా ఉంటారు. బరువు తగ్గాలనుకునే వారికి అతిగా తినడం తగ్గించడమే అతిపెద్ద సవాలు.. ఆ సవాలును చియా విత్తనాలు సులభంగా అధిగమిస్తాయి.

పైన చెప్పుకున్న పదార్థాలన్నింటినీ ఒక గ్లాస్ బాటిల్‌లో వేసుకుని, అందులో కొద్దిగా పుదీనా ఆకులు లేదా పుదీనా నీళు పోసుకోవాలి. పుదీనా జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఈ డ్రింక్‌ను తయారు చేసుకున్న వెంటనే తాగకూడదు. కనీసం ఒక గంట పాటు అలాగే ఉంచాలి. అప్పుడే అందులోని పోషకాలన్నీ నీటిలోకి చేరుతాయి. ప్రతిరోజూ ఉదయాన్నే పరగడుపున ఈ డ్రింక్ తాగడం వల్ల ఫలితాలు ఇంకా వేగంగా ఉంటాయి. క్రమం తప్పకుండా 30 రోజుల పాటు ఈ డిటాక్స్ డ్రింక్ తీసుకుంటే మీ శరీరంలో స్పష్టమైన మార్పులను గమనించవచ్చు. ముఖ్యంగా పొట్ట భాగంలో పేరుకుపోయిన మొండి కొవ్వు కరగడం మొదలవుతుంది. ఆకలి మీ నియంత్రణలోకి వస్తుంది. శరీరం లోపల నుంచి శుభ్రపడటం వల్ల చర్మం కూడా కాంతివంతంగా మారుతుంది. అలసట తగ్గి రోజంతా ఉత్సాహంగా ఉంటారు. బరువు తగ్గడం అనేది ఒక నిరంతర ప్రక్రియ. ఇలాంటి డిటాక్స్ డ్రింక్స్‌ను మీ జీవనశైలిలో భాగం చేసుకోవడం వల్ల ఆరోగ్యకరమైన రీతిలో ఫిట్‌నెస్‌ను సాధించవచ్చు. అయితే దీనితో పాటు తగినంత నీరు తాగడం, నూనె పదార్థాలకు దూరంగా ఉండటం కూడా ముఖ్యమే.

# చిన్న వయసులోనే పిల్లల్లో మానసిక సమస్యలు కారణం అదేనని అంటున్న నిపుణులు!



చిన్న వయసులోనే పిల్లలకు మొబైల్ ఫోన్లు ఇవ్వడం వల్ల వారి మానసిక, శారీరక అభివృద్ధి కుంటుపడుతుంది. కొంతమంది పిల్లలు ఈ మొబైల్ ఫోన్లకు ఎంతగా బానిసలయ్యారంటే తమ తల్లిదండ్రులతో కూడా సమయం గడపడం లేదు. వారి నుంచి మొబైల్ ఫోన్లను లాక్కుంటే తీవ్ర స్థాయిలో కోపం, అసహనం, మానసిక ఒత్తిడిని ప్రదర్శిస్తుంటారు. మొబైల్ ఫోన్లు, టీవీలు పిల్లల బాల్యాన్ని దోచుకుంటున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు. నేటి కాలంలో పిల్లలు బయట ఆడుకునే బదులు టీవీ చూస్తూ, ఫోన్లు వాడుతూ సమయం గడుపుతున్నారు. ఇది వారి మానసిక ఆరోగ్యం, శారీరక అభివృద్ధిని ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తోంది.న్యూరో కేర్ సెంటర్‌కు చెందిన డాక్టర్ జాలీ జైన్ గుప్తా మాట్లాడుతూ.. సాధారణంగానే నేటితరం తల్లిదండ్రులు తమ పిల్లలకు తగినంత సమయం ఇవ్వలేకపోతున్నారు. అంతేకాకుండా పిల్లలు అల్లరి చేయకుండా ప్రశాంతంగా ఉంచడానికి మొబైల్ ఫోన్లు, టీవీల ముందు కూర్చోబెడుతున్నారు. ఇది పిల్లల మానసిక సమతుల్యతను మరింత దిగజార్చుతుంది. అంతేకాకుండా వారి సామాజిక, శారీరక అభివృద్ధి కూడా కుంగిపోతుంది. ఆటలు, క్రీడలు వంటి సహజ కార్యకలాపాలు కూడా తగ్గుతున్నాయి. అందువల్ల తల్లిదండ్రులు తమ పిల్లలతో పాటు తమకు తాముగా కఠినమైన పరిమితులను ఏర్పరచుకోవడం వంటి కొన్ని చిట్కాలను పాటించడం మంచిదని అన్నారు. 2 సంవత్సరాల కంటే తక్కువ వయసున్న పిల్లలను మొబైల్ ఫోన్లకు పూర్తిగా దూరంగా ఉంచాలి. వారికి వీడియో కాల్స్ చేయడానికి కూడా అనుమతించకూడదు. ఈ వయస్సులో స్క్రీన్ వాడకంవల్ల మెదడు అభివృద్ధిపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతుంది. 2 సంవత్సరాల కంటే ఎక్కువ వయసున్న పిల్లలకు స్క్రీన్ సమయం చాలా పరిమితం చేయాలి. చదవడానికి ఉపయోగించినప్పటికీ రోజుకు 15 నిమిషాల కంటే ఎక్కువ సమయం ఇవ్వకూడదు. వారిని ఆన్‌లైన్ గేమ్స్, వీడియోలు, రీల్స్‌కు దూరంగా ఉంచాలి. వీటన్నిటితో పాటు మొబైల్ ఫోన్లు ఉపయోగించే సమయాన్ని పరిమితం చేయాలి.

# ప్రపంచ కప్‌లో చెత్త ఓపెనింగ్ జట్టుగా భారత్.. ఎన్నో స్థానంలో ఉందో తెలుసా..?



టీ20 వరల్డ్ కప్ 2026లో భారత జట్టు ఓపెనింగ్ జోడీ ఘోరంగా విఫలమవుతోంది. ముఖ్యంగా అభిషేక్ శర్మ వరుసగా మూడుసార్లు డకౌట్లు కావడం జట్టును తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టింది. గ్రూప్ దశలోనే టీమిండియా గేమ్ ప్లాన్ మార్చుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. సూపర్–8 దశలో దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి మ్యాచ్‌లో 76 పరుగుల తేడాతో ఘోరంగా ఓడిపోయింది. ఈసారి ఇషాన్ కిషన్ సున్నా పరుగులకే అవుట్ కావడంతో జట్టు తొలి ఓవర్లోనే ఒత్తిడిలో పడింది. ఈ వరుస వైఫల్యాల కారణంగా భారత్ ఈ టోర్నీలో అత్యంత చెత్త ఓపెనింగ్ భాగస్వామ్య సగటు కలిగిన జట్టుగా నిలిచింది.

**టీమ్స్ ఓపెనింగ్ సగటు:**

| | |
|---|---|
| న్యూజిలాండ్ | 84 |
| స్కాట్లాండ్ | 57.75 |
| ఆస్ట్రేలియా | 54.25 |
| దక్షిణాఫ్రికా | 37.20 |
| పాకిస్థాన్ | 30.25 |
| వెస్టిండీస్ | 27.50 |
| శ్రీలంక | 24 |
| ఇంగ్లాండ్ | 16.40 |
| ఒమాన్ | 10 |
| భారత్ | 6.80 |

**భారత్ ఖాతాలో చెత్త రికార్డు:**
టీ20 వరల్డ్ కప్ 2026లో భారత్ ఓపెనింగ్ సగటు కేవలం 6.80 పరుగులే సాధించింది. ఈ జాబితాలో భారత్ 20వ స్థానంలో నిలిచింది. యూఏఈ, ఒమాన్, ఇటలీ లాంటి దేశాల కంటే కూడా భారత్ దిగువన ఉండటం తీవ్ర ఆందోళన కలిగించే విషయం.

**టాప్‌లో న్యూజిలాండ్:**
ఈ టోర్నీలో న్యూజిలాండ్ ఓపెనర్లు అద్భుతంగా రాణిస్తున్నారు. ఈ టీం ఓపెనింగ్ సగటు 84 పరుగులు, ఇది టోర్నీలోనే అత్యుత్తమంగా నిలిచింది. స్కాట్లాండ్, ఆస్ట్రేలియా కూడా మంచి ఆరంభాలతో ముందు వరుసలో ఉన్నాయి. ఆస్ట్రేలియా మిచెల్ మార్ష్‌ను జట్టులోకి తీసుకున్న తర్వాత ఓపెనింగ్ బాగా మెరుగుపడింది. కానీ అప్పటికే ఆలస్యం కావడంతో వారు సూపర్–8కు అర్హత సాధించలేకపోయారు.

**సెమీఫైనల్ రేసు మరింత ఉత్కంఠ:**
దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 76 పరుగుల తేడాతో ఓడిపోవడంతో సెమీఫైనల్ అవకాశాలు మరింత క్లిష్టంగా మారాయి. మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో ఒక్కటి ఓడితే భారత్ టోర్నీ నుంచి నిష్క్రమించే ప్రమాదం ఉంది. అంతేకాదు, సౌతాఫ్రికా తమ మిగిలిన మ్యాచ్‌ల్లో గెలవాలని కూడా భారత్ కోరుకుంటుంది. మరో గ్రూప్‌లో న్యూజిలాండ్–పాకిస్థాన్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కావడంతో.. అక్కడ కూడా పోటీ మరింత ఉత్కంఠగా మారింది. ఇంగ్లాండ్ ఒక మ్యాచ్ గెలిచినా, ఓడినా సమీకరణాలు మారే అవకాశం ఉంది. సూపర్–8లో ఇకపై ప్రతి మ్యాచ్ కీలకం. ఎవరూ ఫేవరెట్ కాదు.. భారత్ ముందుకు వెళ్లాలంటే తప్పనిసరిగా ఓపెనింగ్ సమస్యకు పరిష్కారం కనిపెట్టాల్సిందే. లేకపోతే వరల్డ్ కప్ ప్రయాణం ఇక్కడితో ముగిసే అవకాశం ఉంది.

# అహ్మదాబాద్ అచ్చిరాట్లే: మోడీ స్టేడియంలో మ్యాచులు అస్సలొద్దంటున్న ఫ్యాన్స్..!




గాంధీనగర్: ప్రపంచంలోనే అత్యధిక సీటింగ్ కెపాసిటీ గల క్రికెట్ గ్రౌండ్ నరేంద్ర మోడీ స్టేడియం. గుజరాత్?లోని అహ్మదాబాద్ మోటేరాలో 1 లక్షా 32 వేల సీట్ల సామర్థ్యంతో ఈ మైదానాన్ని నిర్మించారు. అయితే.. ఇండియాలోనే ఉన్న ఈ వరల్డ్ లార్జెస్ట్ క్రికెట్ గ్రౌండ్ టీమిండియాకు ఏ మాత్రం అచ్చి రావడం. ఇందుకు ప్రధాన కారణం ఈ గ్రౌండ్?లో ఇండియా ఆడిన రెండు ఐసీసీ వరల్డ్ కప్ మ్యాచులు ఓడిపోవడమే.
ఐసీసీ ఈవెంట్లలో భాగంగా గత 29 మ్యాచ్‌ల్లో భారత్ కేవలం 2 మ్యాచ్‌ల్లో మాత్రమే ఓడిపోయింది. ఓటమి పాలైన ఈ రెండు మ్యాచులు కూడా నరేంద్ర మోడీ స్టేడియంలోనే కావడం గమనార్హం. 2023, వన్డే వరల్డ్ కప్?లో రోహిత్ శర్మ నేతృత్వంలోని టీమిండియా ఓటమి ఎరగకుండా మెగా టోర్నీ ఫైనల్?కు చేరుకుంది. కానీ నరేంద్ర మోడీ స్టేడియంలో ఆస్ట్రేలియాతో జరిగిన ఫైనల్ మ్యాచులో మాత్రం టీమిండియా ఓటమి పాలై కప్?కు అడుగు దూరంలోనే నిలిచిపోయింది. ఇదిలా ఉండగా.. 2026 టీ20 వరల్డ్ కప్ సూపర్ 8 రౌండ్?లో భాగంగా ఇదే నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగిన మ్యాచులో సౌతాఫ్రికాతో చేతిలో టీమిండియా 75 పరుగుల తేడాతో ఘోర ఓటమి చవిచూసింది. ఇది చాలదన్నట్లుగా ఈ టీ20 వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ కూడా ఇదే స్టేడియంలో జరగనుండటం అభిమానులను మరింత ఆందోళనకు గురి చేస్తోంది. ఈ పరిణామాలను దృష్టిలో ఉంచుకునే నరేంద్ర మోడీ స్టేడియం టీమిండియాకు అస్సలు అచ్చిరావట్లేదని.. ఇక్కడ ఇండియాకు కీలకమైన మ్యాచులు పెట్టొద్దని సోషల్ మీడియాలో కామెంట్స్ చేస్తున్నారు. 1 లక్షా 32 వేల సీట్ల సామర్థ్యం ఉన్న ఈ స్టేడియంలో మ్యాచ్ నిర్వహిస్తే భారీగా జనం స్టేడియానికి వస్తారనేది బీసీసీఐ, ఐసీసీ వ్యూహం. కానీ మోడీ స్టేడియంలో వెంటాడుతోన్న బ్యాడ్ సెంటిమెంట్ కారణంగా అహ్మదాబాద్‌లో మ్యాచులు అస్సలు వద్దని అంటున్నారు టీమిండియా అభిమానులు.

# సూపర్-8లో వెస్టిండీస్ బోణీ... జింబాబ్వేపై భారీ విజయం



టీ20 ప్రపంచకప్ సూపర్–8 పోరులో వెస్టిండీస్ అదరగొట్టింది. ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో జింబాబ్వేపై 107 పరుగుల భారీ తేడాతో ఘనవిజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌లో విధ్వంసం సృష్టించి 255 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించిన విండీస్, ఆ తర్వాత బౌలింగ్‌లోనూ చెలరేగి ప్రత్యర్థిని తక్కువ స్కోరుకే కట్టడి చేసింది. ఈ గెలుపుతో వెస్టిండీస్ తమ గ్రూప్‌లో పటిష్ఠమైన స్థితికి చేరుకుంది. 255 పరుగుల కొండంత లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన జింబాబ్వే ఆరంభం నుంచే తడబడింది. 20 పరుగులకే మూడు కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో డియోన్ మయర్స్ (15 బంతుల్లో 28), కెప్టెన్ సికిందర్ రజా (20 బంతుల్లో 27) కాసేపు పోరాడినా, విండీస్ స్పిన్నర్ల ధాటికి నిలవలేకపోయారు. ముఖ్యంగా స్పిన్నర్ గుడాకేశ్ మోతీ తన స్పిన్ మాయాజాలంతో జింబాబ్వే మిడిల్ ఆర్డర్‌ను కుప్పకూల్చాడు. ఒకే ఓవర్లో రెండు వికెట్లు తీసి మ్యాచ్‌ను పూర్తిగా విండీస్ వైపు తిప్పేశాడు. చివర్లో బ్రాడ్ ఇవాన్స్ (21 బంతుల్లో 43; 2 ఫోర్లు, 5 సిక్సర్లు) ఒంటరి పోరాటం చేసినా అది ఓటమి అంతరాన్ని తగ్గించడానికే సరిపోయింది. దీంతో జింబాబ్వే 17.4 ఓవర్లలో 147 పరుగులకే ఆలౌట్ అయింది. విండీస్ బౌలర్లలో గుడాకేశ్ మోతీ 4 వికెట్లతో చెలరేగగా, అకీల్ హోసేన్ 3, మాథ్యూ ఫోర్డ్ 2 వికెట్లు పడగొట్టారు. అంతకుముందు, టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ ఆరంభం నుంచే దూకుడు ప్రదర్శించింది. షిమ్రాన్ హెట్‌మెయర్ ఆకాశమే హద్దుగా చెలరేగి కేవలం 34 బంతుల్లో 7 ఫోర్లు, 7 సిక్సర్లతో 85 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. అతనికి రోవ్‌మన్ పావెల్ (35 బంతుల్లో 59; 4 ఫోర్లు, 4 సిక్సర్లు) తోడవడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. వీరిద్దరూ కలిసి మూడో వికెట్‌కు కేవలం 52 బంతుల్లోనే 122 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి భారీ స్కోరుకు బలమైన పునాది వేశారు.

# ప్రియాంక చోప్రా బ్యాక్ లెస్ లుక్ సెన్సేషన్స్



గ్లోబల్ ఐకాన్ ప్రియాంక చోప్రా ప్రస్తుతం –ది బ్లఫ్– సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఫ్యాషన్ ప్రపంచాన్ని షేక్ చేస్తోంది. ముఖ్యంగా పీసీ తాజా బ్యాక్‌లెస్ లుక్ సోషల్ మీడియాలో సెన్సేషన్ సృష్టిస్తోంది. నెటిజన్లు ఈ అందాన్ని చూసి –పీసీ పరేషాన్ చేస్తోంది– అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఈ ఫోటోషూట్ సినిమా కథను ఎలివేట్ చేసే థీమ్ తో . కరీబియన్ దొంగ లుక్ తో ఒక ప్రయత్నం. ప్రియాంక తన ప్రమోషన్స్ రెండో రోజున వైన్ కలర్ డ్రెస్సులో మెరిసిపోయింది. ఈ డ్రెస్ డిజైన్ పీసీ వీపందాన్ని ఎలివేట్ చేస్తోంది. దీనితో పాటు పైరేట్ కోర్ గ్లామర్‌ను జోడించి ఒక డిఫరెంట్ లుక్‌ను ఆవిష్కరించింది.
ప్రెస్ టూర్ పేరుతో పీసీ ఈ కొత్త లుక్ ని సెన్సిబుల్ గా ప్రదర్శించింది. తన ప్రదర్శనలతో కేవలం సినిమా గురించి మాట్లాడటమే కాదు.. దానిని ఒక ఫ్యాషన్ రన్ వేలా మార్చేయగలనని పీసీ మరోసారి నిరూపించింది.

**ది బ్లఫ్– విశేషాలు..**
ది బ్లఫ్ సినిమా కథాంశం ఆద్యంతం ఆసక్తికరం. 19వ శతాబ్దపు కరీబియన్ దీవుల నేపథ్యంలో సాగే ఒక పైరేట్ (సముద్రపు దొంగల) యాక్షన్ డ్రామా. ఇందులో ప్రియాంక ఒక మాజీ సముద్రపు దొంగగా, తన కుటుంబాన్ని కాపాడుకునే ధైర్యవంతురాలైన మహిళగా కనిపిస్తుంది. అందుకే పీసీ ప్రమోషన్స్‌లో కూడా ఆ –పైరేట్– లుక్స్‌ను ఎక్కువగా ఉపయోగిస్తోంది. ఇప్పటికే ప్రియాంక చోప్రా లుక్ ని, అలాగే ట్రైలర్ లో తన పాత్రను చూసి దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి ప్రశంసలు కురిపించారు. ఈ చిత్రాన్ని అవెంజర్స్ ఫేమ్ రూస్సో బ్రదర్స్ ఏజిబివో ఫిలింస్ పతాకంపై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రియాంక చోప్రా దీనికి సహనిర్మాతగా ఉన్నారు.



ప్రియాంక షేర్ చేసిన ఈ ఫోటోలు చూసి నెటిజన్లు –బ్రేకింగ్ నెక్స్– (మెడలు తిప్పుకుని చూసేంత అందం) అంటూ కామెంట్స్ చేస్తున్నారు. 43 ఏళ్ల వయసులో ఈ ఫిట్‌నెస్, స్టైల్ విషయంలో నేటి తరం హీరోయిన్లకు పీసీ గట్టి పోటీనిస్తోంది.
హాలీవుడ్‌లో వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్న ప్రియాంక, అటు గ్లామర్ పరంగా ఇటు యాక్టింగ్ పరంగా గ్లోబల్ స్థాయిలో తన ముద్ర వేస్తోంది. –ది బ్లఫ్– సినిమా అమెజాన్ ప్రైమ్ వీడియోలో త్వరలో విడుదల కానుంది.
తదుపరి రాజమౌళి– మహేష్ లతో వారణాసి చిత్రీకరణతోను బిజీ గా గడుపుతున్న పీసీ తదుపరి డాన్ 3లో కూడా కనిపించనుంది.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com